SAMAYAM
epaper.samayamdaily.net APTEL/2006/18267
# సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక

epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుకే.. మన పత్రిక తెలుగు దినపత్రిక
విలేకరులు కావలెను
తెలుగు పత్రికా రంగంలో మరో సంచలనం. వినూత్న రీతిలో వెలువడుతూ విశేష ప్రజాదరణ పొందుతున్న సమయం న్యూస్ తెలుగు డిజిటల్ దినపత్రికకు విలేకరులు కావలెను.
ఆసక్తి అనుభవం కలిగిన వారు సంప్రదించగలరు.
జిల్లాల వారీగా స్టాఫ్ రిపోర్టర్లు, నియోజకవర్గాల వారీగా ఆర్సీ ఇంచార్జీలు, మండలాల వారీగా విలేకరులు కావలెను. సీనియర్లకు ప్రాధాన్యం కొత్తవారికి అవకాశం ఉంటుంది.
ఫోన్ నెం : 99483 13985/ 89789 60131

సంపుటి : 18 సంచిక : 293 ఎడిటర్ : విక్రం కుమార్ మంగళవారం 01, జులై 2025 ప్రచురణ : హైదరాబాద్ పేజీలు: 8 వెల: రూ.5

# మందుల కర్మాగారంలో మహా విపత్తు



- పాశమైలారంలోని సిగాచీ ఇండస్ట్రీస్‌లో విస్ఫోటం
- మంటల్లో చిక్కుకుని 31 మంది మృత్యువాత
- కానరాని ఐదుగురి ఆచూకీ
- మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం
- పీఎం మోదీ, సీఎం రేవంత్‌రెడ్డిల దిగ్భ్రాంతి
- కొనసాగుతున్న సహాయ చర్యలు

**జూన్ 30, సమయం న్యూస్, హైదరాబాద్ :** రాష్ట్ర చరిత్రలోనే ఘోర పారిశ్రామిక ప్రమాదం చోటు చేసుకుంది. సోమవారం ఉదయం హైదరాబాద్ శివారులోని సంగారెడ్డి జిల్లా పటాన్‌చెరు మండలం పాశమైలారం పారిశ్రామికవాడలో సిగాచీ ఇండస్ట్రీస్ లిమిటెడ్ ఔషధ పరిశ్రమలో భారీ విస్ఫోటం సంభవించింది. ఇప్పటివరకు 31 మృతదేహాలను వెలికితీయగా

తరువాయి 2లో





## రామచంద్రుడే రాష్ట్ర కమల దళపతి

- అధ్యక్ష పదవికి ఒక్క నామినేషనే దాఖలు
- అనేక సమీకరణాలను పరిగణనలోకి తీసుకుని ఖరారు చేసిన అధిష్ఠానం
- ఈటలకు నిరాశే.. నామినేషన్ కార్యక్రమానికి దూరం

**జూన్ 30, సమయం న్యూస్, హైదరాబాద్ :** తెలంగాణ కమలదళానికి కొత్త సారథి ఎన్నికపై గత కొన్నాళ్లుగా నెలకొన్న ఉత్కంఠకు తెరపడింది. అధ్యక్ష పదవి రేసులో అనేక పేర్లు

తరువాయి 2లో

## నిర్మాణం ఆపండి.. మీరు అర్హులు కాదు..

- పలుచోట్ల ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీల రద్దు
- గతంలో సిమెంట్, నగదు తీసుకున్నారని నిర్ణయం
- లబోదిబోమంటున్న లబ్ధిదారులు

**జూన్ 30, సమయం న్యూస్,హైదరాబాద్ , వీణవంక :** మీరు గతంలో ఇంటి కోసం ప్రభుత్వ సాయం పొందారని పేర్కొంటూ రాష్ట్రంలో పలు చోట్ల లబ్ధిదారులకు ఇచ్చిన ఇందిరమ్మ ఇళ్ల ప్రొసీడింగ్ కాపీలను అధికారులు రద్దు చేస్తున్నారు. గ్రేటర్ హైదరాబాద్ మినహాయించి 32 జిల్లాల పరిధిలో మొత్తం 3.71లక్షల ఇళ్లను ప్రభుత్వం మంజూరు చేసింది. ఇప్పటి వరకు 2.40లక్షల మందికి ప్రొసీడింగ్ కాపీలను అందించారు. ఇందులో 1.10లక్షల ఇళ్లను గ్రౌండింగ్ చేశారు. ప్రొసీడింగ్ కాపీలు అందుకున్న లబ్ధిదారుల్లో దాదాపు 10 శాతం గత కాంగ్రెస్

తరువాయి 2లో





## ప్రధానితో గవర్నర్ భేటీ

- ప్రధాని మోదీతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ

**జూన్ 30, సమయం న్యూస్, ఢిల్లీ:** ప్రధాని నరేంద్ర మోదీతో గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ సోమవారం ఢిల్లీలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. తెలంగాణలో జరుగుతున్న అభివృద్ధి కార్యక్రమాలతోపాటు, విభిన్న అంశాలపై వారు చర్చించినట్లు తెలిసింది. గత ఏడాది గవర్నర్ల సదస్సు సందర్భంగా ఆగస్టు 4న ప్రధాని మోదీని కలిసిన గవర్నర్ మళ్లీ అధికారికంగా ఇప్పుడే ఆయనతో సమావేశమయ్యారు. అంతకు ముందు ఢిల్లీలోని తెలంగాణ భవన్‌లో సింహవాహిని శ్రీమహంకాళి దేవాలయ కమిటీ ఆధ్వర్యంలో లాల్‌దర్వాజ బోనాలను గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ ప్రారంభించారు. బోనాల ఉత్సవాలకు సంబంధించిన ప్రత్యేక ఫొటో ఎగ్జిబిషన్‌ను తిలకించారు. ఈ ఉత్సవాలు ఇక్కడ రెండురోజులపాటు జరగనున్నాయి. జులై 1న ఇండియా గేట్ నుంచి తెలంగాణ భవన్ వరకు అమ్మవారి గద్దెల ఊరేగింపు, ఘట స్థాపన, 2న పోతురాజు స్వాగతం, అమ్మవారికి బంగారు బోనం సమర్పణ తదితర కార్యక్రమాలు నిర్వహిస్తారు.

## అంగన్‌వాడీలను... దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుదాం



- నిరాదరణకు గురైన తల్లిదండ్రులకు పిల్లల వేతనాల నుంచి వాటా
- సంక్షేమ శాఖలపై సమీక్షలో సీఎం రేవంత్‌రెడ్డి

**జూన్ 30, సమయం న్యూస్, హైదరాబాద్:** తెలంగాణలోని అంగన్‌వాడీ కేంద్రాలను దేశానికి రోల్‌మోడల్‌గా నిలిచేలా తీర్చిదిద్దాలని ముఖ్యమంత్రి ఎ.రేవంత్‌రెడ్డి అధికారులను ఆదేశించారు. మహిళాభివృద్ధి, శిశు సంక్షేమం, దివ్యాంగులు, వయోవృద్ధులు, ట్రాన్స్‌జెండర్ల

తరువాయి 2లో

## అల్పపీడనం ఏర్పడితే.. అప్రమత్తం కావాల్సిందే

- భారత వాతావరణ విభాగం సూచన

2లో





## అమరావతిలో క్వాంటమ్ సేవలు

- జనవరి నుంచి అందుబాటులోకి
- కంప్యూటర్ ఏర్పాటే కాదు.. ఎకోసిస్టంనూ అభివృద్ధి చేస్తాం
- జాతీయ, అంతర్జాతీయ సంస్థలు అందిపుచ్చుకోవాలి
- ప్రభుత్వ సేవలకూ అనుసంధానం చేస్తాం
- 'క్వాంటమ్ డిక్లరేషన్'పై సీఎం చంద్రబాబు ప్రకటన
- విజయవాడలో దిగ్గజ సంస్థలతో వర్క్‌షాప్

**జూన్ 30, సమయం న్యూస్, అమరావతి :** అమరావతిలో వచ్చే ఏడాది జనవరి నుంచి క్వాంటమ్ కంప్యూటర్ పనిచేయడం ప్రారంభమవుతుందని సీఎం చంద్రబాబు ప్రకటించారు. ఐబీఎం, టీసీఎస్, ఎల్‌అండ్‌టీ భాగస్వామ్యంతో క్వాంటమ్ వ్యాలీని రాష్ట్ర ప్రభుత్వం ఏర్పాటు చేస్తోందని తెలిపారు. క్వాంటమ్ వ్యాలీ విధివిధానాలపై జాతీయ, అంతర్జాతీయ నిపుణులతో విజయవాడలో సోమవారం రాష్ట్ర ప్రభుత్వం

తరువాయి 2లో

# అంగన్‌వాడీలను దేశానికి ఆదర్శంగా తీర్చిదిద్దుదాం

(మొదటిపేజీ తరువాయి)

సాధికారత శాఖలపై సీఎం తన నివాసంలో సోమవారం సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ... ''అంగన్‌వాడీ కేంద్రాలకు నిర్మించే నూతన భవనాలను పిల్లల అవసరాలకు తగినట్లు కంటెయినర్ల తరహాలో డిజైన్ చేయించాలి. వాటిని సౌర ఫలకలు, బ్యాటరీ బ్యాకప్‌తో ఏర్పాటుచేయాలి. అంగన్‌వాడీల్లో పౌష్టికాహారం అందజేత, పర్యవేక్షణ, నిర్వహణపై 100 రోజుల కార్యాచరణ రూపొందించాలి. కర్ణాటకలో జొన్న రొట్టెలను ఇస్తున్నారు. పోషకాహార నిపుణులతో చర్చించి... ఇక్కడా మహిళా సంఘాలతో వాటిని అందించేలా చూడాలి. తెలంగాణ ఫుడ్స్, విజయ డెయిరీ ఉత్పత్తులను ఇవ్వాలి. అనాథ పిల్లలకు పాలిటెక్నిక్ కళాశాలలతోపాటు ఏటీసీల్లోనూ ప్రవేశాలు కల్పించాలి. సింగపూర్‌లోని నైపుణ్య శిక్షణ కేంద్రాలకు పంపే వారిలో అనాథలకూ చోటుకల్పించాలి. ఓఆర్ఆర్ పరిధిలోని మురికివాడలు, వలస కార్మికులు ఎక్కువగా ఉండే ప్రాంతాల్లోని చిన్నారుల కోసం మొబైల్ అంగన్‌వాడీ కేంద్రాలను ఏర్పాటు చేయాలి.

**అస్సాంలో మాదిరి అమలుకు కసరత్తు**

సంతానమున్నా... నిరాదరణకు గురవుతున్న తల్లిదండ్రులకు ప్రభుత్వం అండగా నిలవాల్సి ఉంది. ఉద్యోగుల వేతనాల నుంచి నేరుగా వారి తల్లిదండ్రుల బ్యాంకు ఖాతాలకు 1015% జమయ్యే అంశాన్ని పరిశీలించాలి. అస్సాంలో ఇప్పటికే అటువంటి పథకం అమలవుతోంది. ఇతర రాష్ట్రాల్లో ఇంకా అటువంటివి ఏవైనా ఉంటే పరిశీలించి ఒక నివేదిక సమర్పించాలి. ట్రాన్స్‌జెండర్లకు ట్రాఫిక్ విభాగంలో అవకాశం కల్పించాం. వారి సేవలను రవాణా, దేవాదాయ, వైద్యారోగ్య శాఖలతోపాటు ఐటీ, ఇతర కంపెనీలకు విస్తరించాలి. తెలంగాణ రైజింగ్ 2047 డాక్యుమెంట్‌లో చిన్నారులు, మహిళలు, దివ్యాంగులు, వయోవృద్ధుల సంక్షేమానికి తీసుకోవాల్సిన చర్యలపై విధానాలు రూపొందించాలి. దివ్యాంగుల మధ్య వివాహాలకు, వివిధ పథకాల్లో వారికి ప్రోత్సాహకాలను కల్పించేందుకు అధ్యయనం చేసి వచ్చే మంత్రిమండలి సమావేశం నాటికి నివేదిక సమర్పించాలి'' అని ఆదేశించారు. సమీక్షలో మంత్రులు సీతక్క, అడ్లూరి లక్ష్మణ్‌కుమార్, పొన్నం ప్రభాకర్, సీఎం ఓఎస్డీ వేముల శ్రీనివాసులు, వివిధ శాఖల ఉన్నతాధికారులు చిత్రా రామచంద్రన్, సృజన, కట్టా చంద్రశేఖర్‌రెడ్డి, శైలజ తదితరులు పాల్గొన్నారు.

# అమరావతిలో క్వాంటమ్ సేవలు

(మొదటిపేజీ తరువాయి)

వర్క్‌షాప్ నిర్వహించింది. ఐటీ, ఫార్మా, వాణిజ్య, నిర్మాణ రంగాలకు చెందిన దిగ్గజ సంస్థల ప్రతినిధులు పాల్గొన్నారు. అమరావతిలో ఏర్పాటు చేయనున్న క్వాంటమ్ కంప్యూటర్ ప్రొటోటైప్‌ను ఐబీఎం సంస్థ ప్రదర్శించింది. కొత్త స్టార్టప్‌లను సీఎం చంద్రబాబు, మంత్రి లోకేశ్ పరిశీలించారు. నిపుణుల సూచనలను క్రోడీకరించి 'అమరావతి క్వాంటమ్ డిక్లరేషన్'ను ముఖ్యమంత్రి ప్రకటించారు. అనంతరం మాట్లాడుతూ 'కేవలం క్వాంటమ్ వ్యాలీ ప్రారంభించడం కాదు, అవసరమైన ఎకోసిస్టం తీసుకొస్తాం. 2026 ఆగస్టు 15 నాటికి 100 యూజ్ కేస్‌లు (ఏ సమస్యలను సమర్థంగా పరిష్కరించవచ్చో గుర్తించడం) తీసుకురావాలన్నది లక్ష్యం. ఈ విషయంలో ఇబ్బందులుంటే ప్రభుత్వం పరిష్కారం చూపుతుంది. భాగస్వామ్య పక్షాలకు నేనిచ్చే భరోసా ఇది. అమరావతిని క్వాంటమ్ టెక్నాలజీకి కేంద్రంగా తీర్చిదిద్దడమే లక్ష్యం. అంతర్జాతీయ కంపెనీలు ఈ అవకాశాన్ని జారవిడుచుకుంటే.. అది పెద్ద తప్పిదం అవుతుంది' అని సీఎం పేర్కొన్నారు.

**ఎకోసిస్టం అభివృద్ధి కీలకం**

ఒక మెషీన్‌ను తీసుకొచ్చి పెట్టి, క్వాంటమ్ కంప్యూటింగ్ వచ్చేసిందని చెప్పడం ప్రభుత్వ ఉద్దేశం కాదని సీఎం పేర్కొన్నారు. 'నేను పాలసీ రూపొందించడం వరకే పరిమితం. ఎకోసిస్టం అభివృద్ధికి నిపుణుల((( అభిప్రాయాలు కీలకం. టీసీఎస్ సహకారంతో రాష్ట్రంలోని అన్ని రికార్డులను డేటాలేక్‌కు అనుసంధానిస్తున్నాం. వ్యక్తిగత డేటా, ఆధార్ అథెంటికేషన్, ఫ్యామిలీ యూనిట్‌గా ప్రతి ఇంటినీ జియోట్యాగింగ్ చేస్తున్నాం. ఉష్ణోగ్రతలు, తేమ శాతం, వర్షపాతం, పిడుగులు పడే సమాచారం, భూగర్భ జలమట్టం, రిజర్వాయర్లలో నీటి నిల్వలు, నేలలో తేమ, పంట దిగుబడుల అంచనాలు వంటి 42 పారామీటర్లలో రియల్‌టైం డేటా అందుబాటులో ఉంది. వాటిని క్వాంటమ్ కంప్యూటింగ్‌తో అనుసంధానించి, అంతిమ ఫలితాలు అందుకోవాలి. ఫార్మారంగంలోనూ తక్కువ సమయంలో విస్తృత పరిశోధనలు చేసి ఫలితాలు రాబట్టవచ్చ'ని సీఎం వివరించారు. స్టార్టప్‌లకు కూడా విస్తృత అవకాశాలున్నాయని పేర్కొన్నారు. అమరావతిలో ఐకానిక్ భవనం నిర్మించాలని అడిగిన వెంటనే ఎల్ అండ్ టీ సంస్థ అంగీకరించిందని గుర్తుచేశారు. అమరావతి సహా ఐదు ప్రాంతాల్లో రతన్ టాటా ఇన్నోవేషన్ హబ్‌లు ఏర్పాటు చేస్తున్నట్లు చంద్రబాబు వెల్లడించారు.

## అల్పపీడనం ఏర్పడితే..

# అప్రమత్తం కావాల్సిందే

విశాఖపట్నం: బంగాళాఖాతం, అరేబియా సముద్రాల్లో ఏర్పడిన అల్పపీడనాల ప్రభావంతో హిమాచల్‌ప్రదేశ్, ఉత్తరాఖండ్, ఒడిశా తదితర రాష్ట్రాల్లో భారీ వర్షాలు కురుస్తున్నాయి. నదుల్లో, జలాశయాల్లో నీటిమట్టాలు పెరుగుతున్నాయి. వరదలు సంభవిస్తున్నాయి. ఈ నేపథ్యంలో ఎప్పుడు అల్పపీడనం సంభవించినా వెంటనే క్షేత్రస్థాయిలో అప్రమత్తం కావాలని, ప్రత్యేక శ్రద్ధ పెట్టాల్సిన అవసరం ఉందని భారత వాతావరణ విభాగం (ఐఎండీ) సూచించింది. జులైలో అల్పపీడనాల సంఖ్య పెరగకపోయినా, వాటి తీవ్రత ఎక్కువ రోజులు కొనసాగే అవకాశం ఉందని తెలిపింది. దేశవ్యాప్తంగా జులైలో సగటు వర్షపాతం సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతుందని అంచనా వేస్తున్నట్లు తెలిపింది. ఈ నెలలో గరిష్ఠ ఉష్ణోగ్రతలు సాధారణం కంటే ఎక్కువగా నమోదవుతాయని, వర్షాలు లేని ప్రాంతాల్లో వేడి, ఉక్కపోతతో ఇబ్బందులు తప్పవని వాతావరణ నిపుణులు భావిస్తున్నారు. వాయవ్య బంగాళాఖాతంలో పశ్చిమబెంగాల్, బంగ్లాదేశ్ తీరాల్లో అల్పపీడనం కొనసాగుతోంది. దానికి అనుబంధంగా ఉపరితల ద్రోణి కొనసాగుతోంది. ఇది రాబోయే రెండు రోజుల్లో పశ్చిమవాయవ్య దిశగా కదులుతూ ఉత్తర ఒడిశా, పశ్చిమబెంగాల్, ఝార్ఖండ్ వైపు ప్రయాణించనుంది. దీని ప్రభావంతో రాష్ట్రంలోని పలు ప్రాంతాల్లో రాబోయే మూడు రోజుల్లో తేలికపాటి నుంచి ఓ మోస్తరు వర్షాలకు అవకాశముందని ఐఎండీ తెలిపింది. రాయలసీమతోపాటు తమిళనాడు, పుదుచ్చేరి, కరైకల్ ప్రాంతాల్లో బుధవారం వరకు వేడి, ఉక్కపోత వాతావరణం నెలకొనే అవకాశముందని పేర్కొంది.

**చురుగ్గా రుతుపవనాలు**

నైరుతి రుతుపవనాలు తొమ్మిది రోజులు ముందుగానే ఆదివారం నాటికి దేశమంతటా విస్తరించాయి. రాబోయే ఆరు రోజుల్లో తూర్పు, మధ్య, వాయవ్య భారతంలో రుతుపవనాలు చురుగ్గా కదిలేందుకు పరిస్థితులు అనుకూలంగా ఉన్నాయని భారత వాతావరణ విభాగం తెలిపింది. సాధారణంగా రుతుపవనాలు జూన్ 1న కేరళలోకి ప్రవేశించి జులై 8 నాటికి దేశమంతటా విస్తరిస్తాయి. ఈ ఏడాది సాధారణం కంటే ఎనిమిది రోజులు ముందుగా మే 24న కేరళను తాకాయి. జూన్ 2 తర్వాత పొడి గాలుల ప్రభావంతో వాటి చురుకుదనం తగ్గింది.

# మందుల కర్మాగారంలో మహా విపత్తు

(మొదటిపేజీ తరువాయి)

శిథిలాల కింద మరికొందరు చిక్కుకొన్నారని, మృతుల సంఖ్య పెరుగుతుందని అధికారులు చెబుతున్నారు. పేలుడు సమయంలో ఏకంగా 700800 డిగ్రీల ఉష్ణోగ్రత ఉంటుందని అంచనా వేస్తున్నారు. ఈ కారణంగానే అక్కడ పనిచేస్తున్న వారిలో ఐదుగురు సజీవ దహనమయ్యారు. ప్రమాద తీవ్రతకు పరిశ్రమ భవనంలో 14 అంగుళాల మందంతో ఉన్న ప్లింత్‌బీమ్‌లు సైతం విరిగి, కుప్ప కూలిపోవడంతో నష్ట తీవ్రత అనూహ్యంగా పెరిగింది. పరిశ్రమ వైస్ ప్రెసిడెంట్ ఇలంగోవన్ క్వాలిటీ కంట్రోల్ విభాగం నుంచి కిందికి దిగుతున్న సమయంలోనే పేలుడు జరగడంతో ఆయన మృతదేహం 50 మీటర్ల దూరం వరకు ఎగిరి పడిందంటే పరిస్థితి తీవ్రతను ఊహించవచ్చు. ఈ ఘటనపై ప్రధాని మోదీ, ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తంచేశారు. బాధిత కుటుంబాలకు అండగా ఉంటామని ప్రకటించారు. ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి ఆదేశాల మేరకు... మంత్రులు దామోదర్ రాజనర్సింహ, వివేక్‌ల ఆధ్వర్యంలో ఎన్డీఆర్ఎఫ్, హైడ్రా, అగ్నిమాపక సిబ్బంది యుద్ధప్రాతిపదికన సహాయక చర్యలు చేపట్టగా... 11 అగ్నిమాపక శకటాలు మంటలను అదుపు చేశాయి. సంగారెడ్డి కలెక్టర్ ప్రావీణ్య, ఎస్పీ పరితోష్ పంకజ్ సహాయ చర్యల్లో పాల్గొన్నారు

* **అప్పుడా ప్రాంగణంలో 147 మంది...**

గుజరాత్ కేంద్రంగా పనిచేస్తున్న సిగాచీ సంస్థకు తెలంగాణ, మహారాష్ట్రల్లో పరిశ్రమలు ఉన్నాయి. పాశమైలారం పారిశ్రామికవాడలో దాదాపు నాలుగు ఎకరాల విస్తీర్ణంలో ఔషధ తయారీ పరిశ్రమ ఉంది. ఇక్కడ ముడి సరకును శుద్ధి చేసి మైక్రో క్రిస్టలైన్ సెల్యులోజ్ అనే ఔషధాన్ని తయారు చేస్తారు. దీన్ని వివిధ ఔషధ తయారీ సంస్థలకు విక్రయిస్తారు. ఈ పరిశ్రమలో నాలుగు బ్లాకులున్నాయి. సెక్యూరిటీ బ్లాక్ వెనకవైపు ప్రొడక్షన్ విభాగముంది. ఇక్కడే ఔషధం తయారీ జరుగుతుంది. దీనికి పైఅంతస్తులో క్వాలిటీ కంట్రోల్, అడ్మిన్ విభాగాలు ఉన్నాయి. ఇక్కడ మొత్తం 189 మంది సిబ్బంది పని చేస్తుంటారు. వీరిలో ఉత్తరాది రాష్ట్రాలకు చెందిన వారే ఎక్కువగా ఉంటారు. సోమవారం ఉదయం 8 గంటల ప్రాంతంలో సిబ్బంది అంతా యథావిధిగా విధులకు హాజరయ్యారు. ముడి సరకును శుద్ధి చేసేందుకు స్ప్రేయర్ డ్రయ్యర్‌ను ఉపయోగిస్తారు. అది ఉదయం 9.50 గంటల ప్రాంతంలో ఒక్కసారిగా భారీ శబ్దంతో పేలిపోయింది. ఏం జరుగుతోందో తెలిసేలోపే పైఅంతస్తు కుప్పకూలింది. పక్కనే ఉన్న మరో భవనం పాక్షికంగా ధ్వంసమైంది. క్వాలిటీ కంట్రోల్‌తోపాటు మరో విభాగానికి మంటలు దావానలంలా వ్యాపించాయి. ఆ సమయంలో 147 మంది పరిశ్రమ ఆవరణలో ఉన్నట్లు అధికారవర్గాలు చెబుతున్నాయి. వారిలో ఘటనాస్థలంలోనే 17 మంది మృతిచెందగా, ఇద్దరు ఆసుపత్రిలో ప్రాణాలు విడిచారు. మృతుల్లో ఒడిశాకు చెందిన శశిభూషణ్, బిహార్‌కు చెందిన నాగ్‌నాథ్ తివారీ, జగన్‌మోహన్‌లను గుర్తించారు. ఐదుగురి ఆచూకీ లభించడంలేదు. 34 మంది గాయపడగా, వారికి వివిధ ఆసుపత్రుల్లో చికిత్స చేయిస్తున్నారు. 64 మంది కార్మికులు, 22 మంది ఇతర సిబ్బంది, ముగ్గురు భద్రతా సిబ్బంది క్షేమంగా బయటపడ్డారు.

**అక్కడంతా భీతావహం**

కాలిపోయిన మృతదేహాలు... హాహాకారాలు చేస్తున్న క్షతగాత్రులు.. శిథిలాలు తొలగిస్తున్న కొద్దీ బయటపడుతున్న శవాలు... తమ వారికోసం బాధితుల ఆర్తనాదాలతో పరిశ్రమ చుట్టుపక్కల భీతావహంగా మారింది. స్ప్రేయర్ డ్రయ్యర్ పేలగానే దానికి సమీపంలో పనిచేస్తున్న కార్మికులు ఏం జరుగుతుందో తెలుసుకునేలోపే కాలిపోయారు. రియాక్టర్‌కు ముడి పదార్థాన్ని తీసుకొచ్చే పైపులైన్లు, తయారైన పదార్థాన్ని నిల్వ చేసేందుకు వాడే పైపులు కూడా కరిగిపోయినట్లు సహాయ చర్యల్లో పాల్గొన్న సిబ్బంది చెబుతున్నారు. శిథిలాలను తొలగిస్తున్న కొద్దీ మృతదేహాలు బయటపడుతున్నాయి. బరువైన పైపులు, సిమెంటు బీమ్‌లు, ఇనుప గడ్డర్లను క్రేన్లతో తొలగించడానికే చాలా సమయం పడుతోంది. కాలిపోయిన మృతదేహాల నుంచి వస్తున్న కమురు వాసన, రసాయనాల దుర్గంధం కలిసి ఆ ప్రాంతంలో ముక్కుపుటాలు అదురుతున్నాయి.

**డీఎన్ఏ పరీక్షలే దిక్కు**

మృతదేహాలను గుర్తుపట్టడానికి డీఎన్ఏ పరీక్షలే దిక్కని వైద్యులు చెబుతున్నారు. ఇక్కడ చనిపోయిన వారిని... వారివారి కుటుంబ సభ్యుల డీఎన్ఏలతో పోల్చిచూసి గుర్తించాల్సి ఉంటుంది. అప్పటివరకూ మృతదేహాల అప్పగింత సాధ్యంకాకపోవచ్చు.

**పేలుడు ఎందుకు జరిగిందంటే...**

స్ప్రేయర్ డ్రయ్యర్‌లో జరిగే రసాయన మిశ్రమ ప్రక్రియతో ఉష్ణోగ్రత అనూహ్యంగా పెరుగుతుంది. దాన్ని ఎప్పటికప్పుడు స్థిరీకరించేందుకు బ్లో ఎయిర్ హ్యాండ్లర్లను ఉపయోగిస్తారు. గాలిని పీల్చుకొని వదలడంతో వీటిలో దుమ్ము పేరుకుంటుంది. వాటిని ఎప్పటికప్పుడు శుభ్రం చేస్తుండాలి. లేకుంటే స్ప్రేయర్ డ్రయ్యర్ పనితీరు మందగిస్తుంది. బ్లో ఎయిర్ హ్యాండ్లర్‌ను శుభ్రం చేయడంలో నిర్లక్ష్యం కారణంగా దుమ్ము పేరుకుందని, అందుకే డ్రయ్యర్‌లో ఉష్ణోగ్రత అదుపులోకి రాకపోవడంతో పేలుడుకు దారితీసి ఉంటుందని ప్రాథమికంగా అంచనా వేసినట్లు పరిశ్రమల శాఖకు చెందిన ఓ సీనియర్ అధికారి తెలిపారు. అలానే స్ప్రేయర్ డ్రయ్యర్‌లో ముడి ఔషధాన్ని శుద్ధి చేయడానికి హైడ్రోజన్ పెరాక్సైడ్ వాడుతుంటారని, ఇది నిబంధనలకు విరుద్ధమని, పేలుడుకు ఇది కూడా కారణమై ఉండవచ్చనేది మరో వాదన.

# రామచంద్రుడే రాష్ట్ర కమల దళపతి

(మొదటిపేజీ తరువాయి)

వినిపించినా.. సీనియర్ నాయకుడు, మాజీ ఎమ్మెల్సీ ఎన్.రామచందర్‌రావుకే జాతీయ నాయకత్వం పగ్గాలు అప్పగించింది. అనేక సమీకరణాలను విశ్లేషించి... రాష్ట్ర సీనియర్ నేతల అభిప్రాయాన్ని పరిగణనలోకి తీసుకొని న్యాయవాది, ఆర్ఎస్ఎస్ మూలాలున్న రామచందర్‌రావు పేరును ఖరారు చేసింది. అధ్యక్ష ఎన్నిక ప్రక్రియలో భాగంగా సోమవారం రామచందర్‌రావు ఒక్కరు మాత్రమే నామినేషన్ దాఖలు చేయడంతో ఆయన ఎన్నిక లాంఛనంగా మారింది. అధ్యక్ష పదవికి చివరి వరకు రేసులో ఉన్న మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్‌కు నిరాశే మిగిలింది. ఆయన సోమవారం పార్టీ కార్యాలయానికి కూడా రాకపోవడం చర్చనీయాంశమైంది. గోషామహల్ ఎమ్మెల్యే రాజాసింగ్.. తనకు నామినేషన్ వేసేందుకు అనుమతి ఇవ్వలేదంటూ పార్టీకి రాజీనామా చేశారు. కేంద్ర మంత్రి కిషన్‌రెడ్డికి పార్టీ కార్యాలయంలో రాజీనామా లేఖ అందజేశారు. ఈ సందర్భంగా రాజాసింగ్ చేసిన వ్యాఖ్యలు కలకలం రేపాయి.

**కోలాహలంగా నామినేషన్ ప్రక్రియ**

సోమవారం భాజపా రాష్ట్ర కార్యాలయంలో రామచందర్‌రావు నామినేషన్ ప్రక్రియ కోలాహలంగా జరిగింది. ఎన్నికల రిటర్నింగ్ అధికారిణి, కేంద్ర మంత్రి శోభా కరంద్లాజేకు ఆయన రెండు సెట్ల నామినేషన్ పత్రాలను అందజేశారు. కేంద్ర మంత్రులు కిషన్‌రెడ్డి, బండి సంజయ్, ఎంపీలు డీకే అరుణ, కొండా విశ్వేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్యే పాయల్ శంకర్, ఎమ్మెల్సీ కొమరయ్య, సీనియర్ నేత చింతా సాంబమూర్తి సహా పది మంది బలపరిచారు. ఈ కార్యక్రమానికి పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, రాష్ట్ర సంస్థాగత ప్రధాన కార్యదర్శి చంద్రశేఖర్, శాసనసభాపక్ష నేత ఏలేటి మహేశ్వర్‌రెడ్డి, ఎంపీ అర్వింద్, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, కీలక నేతలంతా హాజరయ్యారు.

**మూడేళ్లపాటు పదవిలో..**

భాజపా రాష్ట్ర నూతన అధ్యక్షుడిగా ఎన్నికైన రామచందర్‌రావు ఈ పదవిలో మూడేళ్లు కొనసాగనున్నారు. వచ్చే ఎన్నికల్లో రాష్ట్రంలో ఎలాగైనా అధికారం చేపట్టాలనే లక్ష్యంతో కమలదళం ఉంది. ఈ క్రమంలో పార్టీ అధ్యక్ష పదవికి నేతల నుంచి తీవ్ర పోటీ నెలకొంది. అనేక వడపోతల తర్వాత కొత్త అధ్యక్షుడిని అధిష్ఠానం ఖరారు చేసినట్లు పార్టీ వర్గాలు విశ్లేషిస్తున్నాయి. మొదట బండి సంజయ్ పేరు తెరపైకి వచ్చినా తాను రేసులో లేనంటూ ఆయన బహిరంగంగానే ప్రకటించారు. రాజ్యసభ సభ్యుడు, ఓబీసీ మోర్చా జాతీయ అధ్యక్షుడు లక్ష్మణ్ పేరు వినిపించినా.. ఆయన కూడా ఆసక్తి చూపలేదు. మల్కాజిగిరి ఎంపీ ఈటల రాజేందర్, నిజామాబాద్ ఎంపీ ధర్మపురి అర్వింద్, మహబూబ్‌నగర్ ఎంపీ డీకే అరుణతోపాటు రాజాసింగ్ తదితరులు సైతం అధ్యక్ష పదవికి రేసులో ఉన్నారని చర్చ జరిగింది. కొత్త సారథిపై గత రెండు నెలలుగా తీవ్ర కసరత్తు జరిగింది. పార్టీ జాతీయ ప్రధాన కార్యదర్శి సునీల్ బన్సల్, రాష్ట్ర ఇన్‌ఛార్జ్ అభయ్ పాటిల్ తదితర నేతలు రాష్ట్రంలో రాజకీయ పరిస్థితులపై అధిష్ఠానానికి ఎప్పటికప్పుడు సమాచారం నివేదించారు. జాతీయ అధినాయకత్వం అన్ని కోణాల్లో పరిశీలించి... పార్టీ సీనియర్ నేతలు, ఆర్ఎస్ఎస్ ప్రముఖుల అభిప్రాయం సేకరించి.. రామచందర్‌రావు వైపు మొగ్గు చూపినట్లు తెలిసింది. భాజపా రాష్ట్ర అధ్యక్షుడిగా రామచందర్‌రావును పార్టీ అధిష్ఠానం నియమించిందని రాష్ట్ర అధికార ప్రతినిధి ఎన్వీ సుభాష్ ఒక ప్రకటనలో వెల్లడించారు.

# నిర్మాణం ఆపండి.. మీరు అర్హులు కాదు

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వంలో ఇళ్లు పొందినవారున్నారు. కొంతమంది నామమాత్ర ధరకు వస్తున్న సిమెంట్, ప్రభుత్వం ఇచ్చిన నగదు తీసుకున్నారు. మరికొందరు సిమెంట్ మాత్రమే తీసుకుని ఇళ్లను నిర్మించుకోలేదు. ఇంకొందరు మధ్యలోనే నిర్మాణం వదిలేశారు. కొత్తగా వచ్చిన కాంగ్రెస్ ప్రభుత్వం ప్రజాపాలనలో భాగంగా ఇందిరమ్మ ఇళ్లకు దరఖాస్తులను ఆహ్వానించింది. చాలా మంది గతంలో ఇళ్ల కోసం వివిధ రూపాల్లో లబ్ధిపొందినవారు మళ్లీ దరఖాస్తు చేసుకున్నారు. ప్రభుత్వ యంత్రాంగం దరఖాస్తుదారుల ఇళ్లకు వెళ్లి 360 డిగ్రీల కోణంలో విచారణ చేసి ఎల్1, ఎల్2, ఎల్3 జాబితాను రూపొందించింది. మొదటి దశలో సొంత స్థలాలు ఉన్న దరఖాస్తుదారులను గుర్తించి ఇందిరమ్మ ఇళ్లను మంజూరు చేసింది. తర్వాతే ప్రొసీడింగ్ కాపీలను లబ్ధిదారులకు అందించింది. తీరా ఇప్పుడు ఇళ్లు నిర్మించుకునే సమయంలో గతంలో లబ్ధిపొందారని ప్రొసీడింగ్ కాపీలను రద్దు చేస్తున్నారు. ఈ విషయం ముందే చెబితే ఉన్న గూడును కూల్చుకునేవారం కాదుకదా అని పలువురు లబ్ధిదారులు ఆవేదన చెందుతున్నారు. ఎప్పుడో 20 ఏళ్ల కిందట సిమెంట్ బస్తాలను తీసుకుంటే ఇప్పుడు అనర్హులని ఎలా చెబుతారని ప్రశ్నిస్తున్నారు. ఈ విషయాన్ని హౌసింగ్ కార్పొరేషన్ సీఈ చైతన్యకుమార్ దృష్టికి 'ఈనాడు' తీసుకెళ్లగా గతంలో లబ్ధిపొందిన వారికి ప్రస్తుతం ఇళ్లు ఇవ్వడం లేదన్నారు. కొన్ని చోట్ల అధికారుల లాగిన్‌తో ప్రొసీడింగ్ కాపీలు వస్తున్నాయని, మళ్లీ క్షేత్రస్థాయిలో వెళ్లి పరిశీలిస్తే అనర్హులని తేలుతుందని వెల్లడించారు. గతంలో పునాది వరకు నిర్మించుకుని వదిలేసిన వారికి మాత్రమే ఇళ్లు మంజూరు చేస్తామని చెప్పారు.

# ఇందిరమ్మ ఇళ్లకు నిర్మాణ సామగ్రి ధరలు అందుబాటులో ఉండాలి

* **ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క**



హైదరాబాద్: ఇందిరమ్మ ఇళ్ల కోసం సిమెంటు, స్టీల్, ఇటుక తదితర నిర్మాణ సామగ్రి ధరలు సామాన్యులకు అందుబాటులో ఉండేలా మండల స్థాయిలో ధరల నిర్ణయ కమిటీలు సమావేశమై నిర్ణయించాలని ఉప ముఖ్యమంత్రి భట్టి విక్రమార్క పేర్కొన్నారు. సచివాలయంలో సోమవారం ఆర్థిక వనరుల సమీకరణపై ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఇందులో మంత్రివర్గ ఉపసంఘం సభ్యులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, శ్రీధర్‌బాబు, వివిధ శాఖల అధికారులు పాల్గొన్నారు. గత సమావేశంలో తీసుకున్న నిర్ణయాలు, వాటి ప్రగతిపై శాఖలవారీగా సమీక్షించారు. రాష్ట్రంలో 20 ప్రాంతాల్లో ఇసుక విక్రయ కేంద్రాలను ఏర్పాటు చేసినట్లు అధికారులు తెలిపారు. మార్కెట్ యార్డులు, ప్రభుత్వ స్థలాల్లో సామాన్యులకు ఇసుక అందుబాటులో ఉంచాలని మంత్రులు సూచించారు. ఎల్ఆర్ఎస్ దరఖాస్తుల పరిష్కారం వేగవంతం చేయడం, ఏజెన్సీ ప్రాంతాల్లో మధ్యవర్తుల ప్రమేయం లేకుండా గిరిజనులే ఇసుక క్వారీలు నిర్వహించడం, హైదరాబాద్‌లో కాలుష్యకారక పరిశ్రమల తరలింపు, గనుల శాఖలో వన్‌టైం సెటిల్‌మెంట్ 0తదితర అంశాలపై మంత్రివర్గ ఉప సంఘం చర్చించింది. ఆర్థిక వనరుల సమీకరణపై ఉప సంఘం తీసుకున్న నిర్ణయాలపై సీఎస్ ఆధ్వర్యంలో ప్రతి రోజు సమీక్షించాలని భట్టి ఆదేశించారు.




## పాఠశాలకు ప్యూరిఫైర్ అందజేత

రాయపోల్,జూన్30, మండల పరిధిలోని అనాజిపూర్ ప్రాథమిక పాఠశాల విద్యార్థుల కోసం అదే గ్రామానికి చెందిన బిజెపి మండల ప్రదాన కార్యదర్శి నీల స్వామి సోమవారం వాటర్ పూరిఫైర్ అందజేశారు. పాఠశాలకు వాటర్ ప్యూరిఫైర్ ను అందజేసిన నీల స్వామి కి ప్రధానోపాధ్యాయులు నర్సింలు కృతజ్ఞతలు తెలిపారు.



## ప్రజాసమస్యలను తప్పనిసరిగా పరిష్కరించాలి

* **ప్రభుత్వ పథకాలు..పక్కాగా అమలు**
* **అధికారుల నిరంతర పర్యవేక్షణ**
* **ఈనాటి గ్రీవన్స్ కి 97 దరఖాస్తు లు**
* **మెదక్ కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్ జూన్30 (సమయం న్యూస్) : ప్రజా సమస్యలు తప్పనిసరిగా పరిష్కరించాలని, ప్రభుత్వ పథకాలు పక్కగా అమలు చేయాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ అన్నారు. సోమవారం గ్రీవెన్స్ కార్యక్రమాన్ని పురస్కరించుకొని అదనపు కలెక్టర్ నగేష్, జడ్పీ సీఈఓ ఎల్లయ్య, డి ఆర్ డి ఓ పి డి శ్రీనివాసరావు లతో కలిసి కలెక్టరేట్ కార్యాలయంలో జిల్లా ప్రజల నుండి కలెక్టర్ వినతులను స్వీకరించారు. స్వీకరించిన దరఖాస్తు లను సంబంధిత శాఖ వారికి అందజేస్తూ త్వరితగతిన ప్రజల సమస్యలను క్షేత్రస్థాయిలో విచారణ జరిపించి పరిష్కరించాలన్నారు. ఈనాటి గ్రీవన్స్ కి 97 దరఖాస్తు లు రాగా.... భూ సమస్యలు.33, ఇంది రమ్మ ఇండ్ల కొరకు. 20, పింఛన్ కొరకు 05, ఇతర సమస్యలు 39 సమస్యలు ఉన్నాయి. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ ప్రజా సమస్యల పరిష్కారమే ధ్యేయంగా కృషి చేయాలన్నారు,అభివృద్ధి సంక్షేమ పథకాలు ప్రజలకు అందించే విధంగా పనిచేయాలని అధికారులను ఆదేశించారు. ఈ కార్యక్రమంలో వివిధ శాఖల జిల్లా అధికారులు తదితరులు పాల్గొన్నారు.



## ప్రభుత్వ సలహా దారు మహమ్మద్ షబ్బీర్ అలీ సి ఎం ఆర్ ఎఫ్ చెక్కులు పంపిణీ

నిజామాబాద్ జూన్ 30 (సమయం న్యూస్) : నిజామాబాద్ పట్టణంలోని R,&B గెస్ట్ హౌస్ లో ప్రభుత్వ సలహాదారు మొహమ్మద్ అలీ షబ్బీర్ గారు నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గానికి చెందిన వారికి ముఖ్యమంత్రి సహాయ నిధి (CMRF) 27 చెక్కులను దాదాపు 16లక్షల రూపాయలు లబ్దిదారులకు పంపిణి చేశారు. ఈ సందర్భంగా షబ్బీర్ అలీ గారు మాట్లాడుతూ నిజామాబాద్ అర్బన్ నియోజక వర్గంలోనీ పలు కాలనీల లోని బాధితులకు సీఎం సహాయ నిధి నుండి నిధులు మంజూరు చేయించడం జరిగింది అన్నారు. అనారోగ్యంతో అప్పుల పాలైన వారికి సీఎంఆర్ఎఫ్ చెక్కులు ఎంతో కొంత ఉపశమనం కలిగిస్తాయి అన్నారు. పేదలకు సహాయంగా అండగా. నియోజకవర్గ ప్రజల మంచి మాత్రమే కోరుకుంటామన్నారు. ఇందిరమ్మ ఇండ్లు మరియు కొత్త రేషన్ కార్డులు అర్హులకు అందిస్తాం. ఎన్నికల్లో ఇచ్చిన హామీల కంటే ఎక్కువగానే అమలు చేస్తున్నాం. రుణమాఫీ చేసి చూపించాం రైతు భరోసా అందిస్తున్నాం.మహిళలకు ఉచిత బస్సు 500 రూపాయలకు గ్యాస్ సిలిండర్ 200 యూనిట్ వరకు ఉచిత విద్యుత్ అందిస్తున్నాం అన్నారు. రాజీవ్ యువ వికాసం పథకముద్వర నిరుద్యోగ యువకులు స్వయం ఉపాధి దక్కుతుందన్నారు.

## పాశమైలారం అగ్ని ప్రమాద ఘటనదిగ్భ్రాంతి వ్యక్తం చేసిన కేటీఆర్ మరణించిన బాధిత కుటుంబాలకు సంతాపం

హైదరాబాద్ జూన్30(సమయం న్యూస్) : సంగారెడ్డి జిల్లా పాశమైలారం లోని ఒక పరిశ్రమలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంలో పలువురుకార్మికులు మృతి చెందడం పట్ల బిఆర్ఎస్ అధినేత కేసీఆర్ గారు దిగ్భ్రాంతిని వ్యక్తంచేస్తూ తన సంతాపాన్ని ప్రక టించారు. మృతుల సంఖ్య ఇంకా పెరగనున్నదనే వార్తల పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. ప్రమాదానికి కారణా లపై విచారణ జరిపించాలని, అగ్ని ప్రమాదంలో గాయపడిన వారికి తక్షణమే మెరుగైన వైద్య చికిత్స అందించాలని, చని పోయిన కార్మికులు ఉద్యోగుల కుటుంబాలను ఆర్థికంగా ఆదుకోవా లని ప్రభుత్వానికి కేసీఆర్ గారు సూచించారు. మరణించిన వారి కుటుంబాలకు కేసీఆర్ తన ప్రగాఢ సానుభూతిని తెలిపారు.

# జంక్షన్ అభివృద్ధి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలి

: **మేయర్ గద్వాల్ విజయలక్ష్మి**

హైదరాబాద్, జూన్ 30, (సమయం న్యూస్): జంక్షన్ అభివృద్ధి యుద్ధప్రాతిపదికన పూర్తి చేయాలని నగర మేయర్ గద్వాల్ విజయలక్ష్మి అధికారులను ఆదేశించారు. సోమవారం ఆమె శేరిలింగంపల్లి జోన్ లోని పలు అభివృద్ధి కార్యక్రమాలను పరిశీలించారు. జక్షన్ అభివృద్ధిలో 11 ఆస్తులు కోల్పోతున్న వారితో మాట్లాడి సాయత్రం వరకు నివేదిక ఇవ్వాలని జోనల్ కమీషనర్ ను మేయర్ ఆదేశించారు. అవసరమైతే స్టాండింగ్ కమిటీలో చర్చించి చర్యలు తీసుకుంటామన్నారు. ఈ సందర్భంగా బ్రహ్మశంకర్ నగర్ లో ఓపెన్ జిమ్, మల్టీ పర్పస్ ఫంక్షన్ హాల్ నిర్మాణ పనులను పరిశీలించి నిర్దేశించిన కాలవ్యవధిలో పూర్తి చేసి ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని జోనల్ కమీషనర్ ను కోరారు. మూడు అంగన్వాడీ కేంద్రాలను





పరిశించించి పిల్లలకు అందిస్తున్న పోషకాహారం వివరాలను తెలుసుకొని పిల్లలను అడిగి తెలుసుకున్నారు. మరో అంగన్వాడి కేంద్రం ఏర్పాటు చేయాలని బస్తీ వాసులు మేయర్ ను కోరగా తగు చర్యలు తీసుకోవాలి జోనల్ కమీషనర్ ను ఆదేశించారు. యూసఫ్ గూడ ట్రాన్స్ఫర్ స్టేషన్ ను పరిశీలించి స్వచ్ఛ ఆటో డ్రైవర్ లతో మాట్లాడి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. దానితో పాటు కేటాయించిన ఇంటింటి చెత్త సేకరణ చేయని వారి స్థానంలో ఇంకొక నిరుద్యోగ యువతకు అలాట్ చేస్తామన్నారు. ట్రాన్స్ఫర్ స్టేషన్ కెపాసిటీ పెంచాలని, స్వచ్ఛ ఆటో డ్రైవర్ లు కోరగా కెపాసిటీ పెంచే విధంగా చర్యలు తీసుకోవాలని జోనల్ కమిషనర్, ఏ సి శానిటేషన్ రాంకీ యాజమాన్యాన్ని ఆదేశించారు. ఈ సంద ర్భంగా మేయర్ రహమత్ నగర్, బ్రహ్మ శంకర్ నగర్, యూసఫ్ గూడ ప్రదేశాలలో పర్యటించి పలు పనులను పరిశీలించారు. కార్పొరేటర్ సి ఎన్ రెడ్డి.జోనల్ కమీషనర్ హేమంత్ సహదేవ్ రావు,సి ఈ సహదేవ్ రత్నాకర్, ఏ సి శానిటేషన్ రఘు ప్రసాద్, ప్రాజెక్టు ఈ ఈ నూన్య నాసిక్, టౌన్ ప్లానింగ్ అధికారులు తులసి రామ్, శ్యామ్,డిప్యూటీ కమీషనర్ జాకీయ సుల్తానా తదితరులు పాల్గొన్నారు.

# డ్రాపౌట్ లు ఎక్కువగా ఉన్న బడులపై ప్రత్యేక దృష్టి సారించాలి

* **కలెక్టర్ టి వినయ్ కృష్ణారెడ్డి**

నిజామాబాద్ జూన్ 30(సమయం న్యూస్) : డ్రాపౌట్ లు ఎక్కువగా ఉన్న ప్రభుత్వ పాఠశాలలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి విద్యా శాఖ అధికారులకు సూచించారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో అన్ని సర్కారు బడులలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా చొరవ చూపాలన్నారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని మినీ కాన్ఫరెన్స్ హాల్ లో కలెక్టర్ సోమవారం మండల విద్యా శాఖ అధికారులతో సమీక్ష జరిపారు. జూన్ 06 నుండి 12 వరకు నిర్వహించిన బడిబాట సందర్భంగా నూతనంగా నమోదైన ప్రవేశాల గురించి ఒక్కో మండలం వారీగా వివరాలు అడిగి తెలుసుకున్నారు. వారం రోజుల పాటు విద్యార్థులు ప్రవేశాలపై ప్రత్యేక దృష్టిని కేంద్రీకరించాలని, ప్రభుత్వ బడులలో



మెరుగుపడిన మౌలిక సదుపాయాలు, ఉత్తీర్ణత, భర్తీ అయిన టీచర్ల ఖాళీలు, నాణ్యమైన విద్యా బోధన, ఉచితంగా యూనిఫామ్ లు, టెక్స్ట్ బుక్కులు, నోట్ బుక్కులు సమకూరుస్తున్న విషయాల గురించి ఇంటింటికి వెళ్లి విద్యార్థులు, వారి తల్లిదండ్రులకు వివరిస్తూ పిల్లలను ప్రభుత్వ బడులలో చేర్పించేలా కృషి చేయాలన్నారు. కాగా, అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో మౌలిక సదుపాయాల మెరుగుదల కోసం చేపట్టిన మరమ్మతు పనులను వేగంగా పూర్తి చేయించాలని, ఈ పనులకు నిధులు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. అవసరమైన బడులలో కిచెన్ షెడ్ లు వంటి వాటి నిర్మాణాలకు ప్రతిపాదనలు పంపాలన్నారు. పదవ తరగతి ఉత్తీర్ణులైన ప్రతి విద్యార్థి కళాశాలల్లో చేరేలా పర్యవేక్షణ జరపాలని అన్నారు. పదవ తరగతి పూర్తి చేసుకుని పై చదువులలో చేరని వారిని గుర్తిస్తూ, ఒక్కో విద్యార్థి వారీగా పూర్తి వివరాలు సేకరించాలని ఆదేశించారు. ఇప్పటికే అన్ని పాఠశాలల్లో విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పూర్తిస్థాయిలో పంపిణీ జరిగాయని, నోట్ బుక్కులు కూడా 80 శాతం వరకు పంపిణీ అయ్యాయని మిగతా వాటిని కూడా జిల్లాకు కేటాయించిన వెంటనే విద్యార్థులకు ఆయా పాఠశాలల వారీగా అందేలా చర్యలు తీసుకోవాలని అన్నారు. ఒక జత ఏకరూప దుస్తులు ఇప్పటికే విద్యార్థిని విద్యార్థులకు అందించామని, రెండవ జత యూనిఫామ్ లను మహిళా స్వయం సహాయక సంఘాలు త్వరగా కుట్టించి ఇచ్చేలా కృషి చేయాలని అన్నారు. సమావేశంలో అదనపు కలెక్టర్ అంకిత్, ట్రైనీ కలెక్టర్ కరోలిన్ చింగ్తియాన్ మావీ, డీఈఓ అశోక్, ఎంఈఓలు, సంబంధిత అధికారులు పాల్గొన్నారు.

# పరిశ్రమలో రియాక్టర్ పేలి 13 మంది దుర్మరణం

* **పాశం మైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి పరిశ్రమలో ప్రమాదం**
* **36 మందికి గాయాలు, 33 మంది లోపల చిక్కుకున్నట్టు అనుమానం**
* **సంఘటనా స్థలాన్ని సందర్శించిన కార్మిక శాఖ మంత్రి, ఆరోగ్య శాఖ మంత్రి, మాజీ ఆరోగ్య శాఖ మంత్రి, స్థానిక ఎమ్మెల్యే, స్థానిక ఎమ్మెల్సీ**
* **మృతుల కుటుంబాలకు కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాల్సిందే మాజీ మంత్రి హరీష్ రావు, స్థానిక ఎమ్మెల్యే గూడెం మహిపాల్ రెడ్డి**
* **ప్రమాదానికి పూర్తి బాధ్యత పరిశ్రమ యాజమాన్యనిదే**
* **పరిశ్రమలోని నాలుగు అంతస్తుల భవనం నేలమట్టం**
* **క్షతగాత్రులను పరామర్శించిన నాయకులు**
* **సంఘటన స్థలంలోనే జిల్లా అధికారులు**
* **కొనసాగుతున్న రెస్క్యూ ఆపరేషన్**

పటాన్ చెరు, జూన్ 30, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా పటాన్ చెరు నియోజకవర్గంలోని పాశం మైలారం పారిశ్రామిక వాడలో గల శిగాచి పరిశ్రమలో సోమవారం ఉదయం 9 45 నిమిషాలకు రియాక్టర్ పేలి భారీ అగ్ని ప్రమాదం సంభవించింది. ఈ ప్రమాదంలో పరిశ్రమలోని నాలుగు అంతస్తుల భవనం నేలమట్టం అయ్యింది. ఈ సంఘటనలో 15 మంది మృత్యువాత పడగా, 36 మంది క్షతగాత్రులను వివిధ ఆసుపత్రులలో చికిత్స నిమిత్తం పంపించడం జరిగింది. వీరిలో 12





మంది పరిస్థితి విషమంగా ఉందని తెలుస్తుంది. శిథిలాల కింద 43 మంది ఉన్నట్లు సమాచారం అందుతుంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉందని తెలుస్తుంది. ఒక షిఫ్ట్ లో సుమారు 150 మంది వరకు కార్మికులు పని చేస్తున్నారని ఐజి సత్యనారాయణ తెలిపారు. పేలుడు ప్రభావానికి సుమారు 100 మీటర్ల దూరంలో కార్మికులు ఎగిరిపడ్డారని తెలుస్తుంది. పరిశ్రమలో పనిచేసే కార్మికులు వివిధ రాష్ట్రాల నుంచి వచ్చిన వారేనని సమాచారం. పరిశ్రమలో పనిచేస్తున్న కార్మికుల కుటుంబ సభ్యులను పట్టించుకోని పరిశ్రమ యాజమాన్యం, అధికారులు. ప్రమాద విషయాన్ని తెలుసుకున్న స్థానిక శాసనసభ్యులు గూడెం మహిపాల్ రెడ్డి పరిశ్రమను సందర్శించారు. అధికారులతో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ఈ సందర్భంగా గూడెం మహిపాల్ రెడ్డి మాట్లాడుతూ ప్రమాదానికి పూర్తి బాధ్యత పరిశ్రమ నిర్లక్ష్యమేనని, పరిశ్రమలు భద్రతా నియమాలు పాటించకపోవడం వల్లే ఇంత ఘోరం జరిగిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. మృతి చెందిన ప్రతి కార్మిక కుటుంబానికి కోటి రూపాయల నష్టపరిహారం ఇవ్వాలని ఆయన డిమాండ్ చేశారు .ఇన్స్పెక్టర్ ఆఫ్ ఫ్యాక్టరీస్ వారు నామ మంత్రంగా తనిఖీలు చేస్తున్నారని ఆయన అన్నారు. ప్రమాద స్థలానికి వైద్యారోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ, కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామిలు చేరుకొని పరిస్థితిని పర్యవేక్షిస్తున్నారు. ఎన్డీఆర్ఎఫ్, ఫైర్ సిబ్బంది, హైడ్రా సిబ్బంది రెస్క్యూ ఆపరేషన్ నిర్వహిస్తున్నారు. శిథిలాలను తొలగిస్తూ మృత దేహాలను వెలికి తీసే కార్యక్రమం జోరుగా సాగుతుంది. ఈ సందర్భంగా కార్మిక శాఖ మంత్రి వివేక్ వెంకటస్వామి మాట్లాడుతూ పరిశ్రమలు ఈ సంఘటన జరగడం దురదృష్టకరమని ఆయన అన్నారు. సంఘటన ఏ విధంగా జరిగింది అని ఇప్పుడే నిర్ధారించలేమని ఆయన తెలిపారు. మరణించిన కార్మిక కుటుంబాలకు ప్రభుత్వం తరపున ఎక్స్గ్రేషియా ఇప్పిస్తామని ఆయన తెలియజేశారు. భద్రత నాణ్యత పాటించని పరిశ్రమలపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు. నియోజకవర్గంలోని అన్ని పరిశ్రమలు నాణ్యత పరమైన భద్రతా విధానాలను అమలు చేయాలని ఆయన సూచించారు .ఈ సందర్భంగా వైద్య ఆరోగ్య శాఖ మంత్రి దామోదర రాజనర్సింహ మాట్లాడుతూ గాయపడిన కార్మికులకు మెరుగైన వైద్యం కోసం కార్పొరేట్ ఆస్పత్రులలో వైద్యం ప్రభుత్వం తరఫున అందిస్తామని అన్నారు. పరిశ్రమలో జరిగిన సంఘటనను రాజకీయం చేయొద్దని ఆయన తెలిపారు. కార్మికుల కుటుంబాలకు అండగా ఉంటామని ఆయన తెలిపారు .పరిశ్రమ వద్ద కార్మికుల బంధువులు ఇబ్బంది పడకుండా కంట్రోల్ రూమ్ లను ఏర్పాటు చేసినట్లు ఆయన తెలిపారు. గాయపడిన కార్మికులను మదినగూడ లోని ఆసుపత్రిలో మంత్రులు పరామర్శించారు. పరిశ్రమలో పేలుడు దాటికి సుమారు రెండు కిలోమీటర్ల పరిధి వరకు ప్రకంపనలు వచ్చాయని, వాహనాల అద్దాలు పగిలిపోయాయని స్థానికులు తెలిపారు. డిజిపి ఇక్బాల్, జిల్లా కలెక్టర్ ప్రావిణ్య, ఎస్పీ పరతోష్ పంకజ్ ఆధ్వర్యంలో రిస్క్యూ ఆపరేషన్ కొనసాగుతూనే ఉంది. మృతుల సంఖ్య మరింత పెరిగే అవకాశం ఉన్నట్టు సమాచారం.



epaper.samayamdaily.net APTEL/2006/18267
సమయం
మన గొంతుక.. మన పత్రిక · తెలుగు దినపత్రిక




## కార్మికుని అంత్యక్రియలకు ఆర్థిక సహాయం

* **వివిఆర్ ఫౌండేషన్ చైర్మన్ వరప్రసాద్ రెడ్డి**

జిన్నారం, జూన్ 30, సమయం న్యూస్ : సంగారెడ్డి జిల్లా బొల్లారం మున్సిపల్ పరిధిలోని ఆటో కార్మికుల కుటుంబానికి వివిఆర్ ఫౌండేషన్ తరపున ఆర్థిక సహాయాన్ని అందించారు. బొల్లారంలో నివాసం ఉంటు ఆటో డ్రైవర్ గా పనిచేస్తున్న యాదగిరి అనారోగ్యంతో సోమవారం మృతి చెందాడు. ఈ విషయం స్థానికుల ద్వారా తెలుసుకున్న వివిఆర్ ఫౌండేషన్ వ్యవస్థాపకులు రాష్ట్ర కార్మిక నాయకులు వర ప్రసాద్ రెడ్డి, అంత్యక్రియల నిమిత్తం 7వేల రూపాయలు కార్మిక నాయకుడు లఖన్ సింగ్ ద్వారా బాధిత కుటుంబానికి అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆటో యూనియన్ అధ్యక్షులు నాగిరెడ్డి, జంగి రెడ్డి సురేష్, కృష్ణ, బాధిత కుటుంబ సభ్యులు, ఆటో యూనియన్ నాయకులు, స్థానికులు తదితరులు పాల్గొన్నారు.

## రెవెన్యూ అదనపు కలెక్టర్ మోహన్ రావు కు పదవీ విరమణ ఆత్మీయ సన్మాన కార్యక్రమం

మహబూబ్ నగర్, జూన్30 (సమయం న్యూస్) : సోమవారం పదవీ విరమణ పొందిన రెవెన్యూ అదనపు కలెక్టర్ ఎస్. మోహన్ రావుకు ఆత్మీయ సన్మాన కార్యక్రమం జిల్లా కలెక్టర్ కార్యాలయం లో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ విజయేందిర బోయి మాట్లాడుతూ ఉద్యోగ విరమణ ప్రతీ ఉద్యోగికి తప్పనిసరి అని గత రెండు సంవత్సరాలుగా అదనపు కలెక్టర్ (రెవెన్యూ) గా సేవలందించి అందరి మన్ననలను పొందారని, వారి సేవలు చిరస్మరణీయం అని కొనియాడారు.. వృత్తి పట్ల నిబద్ధత, అంకిత భావం తో విధులు నిర్వహించారని, రెవెన్యూ శాఖ లో ముఖ్యంగా జిల్లాలో వారు అందించిన సేవలు మరువలేనివి అని అన్నారు.అందరి అధికారులు, ఉద్యోగుల మన్నన పొందిన వ్యక్తి అని అని అభినందించారు.సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, జిల్లా అధికారులు,టి.జి. ఓ,టి. ఎన్.జి. ఓ నాయకులు తహశీల్దార్ లు, రెవెన్యూ ఉద్యోగులు అదనపు కలెక్టర్ తో కలిసి పనిచేసిన వారి అనుభవాలను పంచుకున్నారు. శేష జీవితాన్ని ఆయు రారోగ్యాలతో, సుఖ సంతోషాలతో గడపాలని ఆన్నారు..సమావేశం లో స్థానిక సంస్థల అదనపు కలెక్టర్ శివేంద్ర ప్రతాప్, గద్వాల రెవెన్యూ అదనపు కలెక్టర్ లక్ష్మి నారాయణ, నాగర్ కర్నూల్ రెవెన్యూ అదనపు కలెక్టర్ ఆమరేందర్ డి.ఎస్. పి.వేంకటేశ్వర్లు, జిల్లా అధికారులు, బంధు మిత్రులు, రెవెన్యూ ఉద్యోగులు పాల్గొన్నారు.




## ఎస్బీఐ 70వ వార్షికోత్సవం సందర్భంగా జిల్లావ్యాప్తంగా సేవా కార్యక్రమాలు

నిర్మల్, జూన్30 ( సమయం, న్యూస్) : స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా (ఎస్బీఐ) స్థాపించబడిన తేది జూలై 1, 1955 నుంచి రేపటితో 70వ సంవత్సరంలోకి అడుగుపెడుతున్న సందర్భంగా జిల్లాలోని మొత్తం 19 ఎస్బీఐ శాఖల ఆధ్వర్యంలో వివిధ సేవా కార్యక్రమాలు చేపట్టనున్నట్లు లీడ్ డిస్ట్రిక్ట్ మేనేజర్ రామ్ గోపాల్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఇంపీరియల్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా ప్రారంభమైన సంస్థ, 1955 జూలై 1న స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియాగా రూపాంతరం చెంది, ప్రస్తుతం దేశవ్యాప్తంగా 22,970 శాఖలతో విస్తరించి, దేశంలోనే అతిపెద్ద బ్యాంకుగా ఎదిగిందని వివరించారు. వినియోగదారులకు సురక్షితంగా, వేగవంతంగా, విశ్వసనీయ సేవలు అందించడమే



తమ లక్ష్యమని, ప్యూర్ బ్యాంకింగ్, నథింగ్ ఎల్స్ అనే నినాదంతో బ్యాంక్ ముందుకు సాగుతోందని అన్నారు. వార్షికోత్సవాన్ని పురస్కరించుకొని జిల్లావ్యాప్తంగా రక్తదాన శిబిరాలు, అనాథాశ్రమాలకు అవసరమైన వస్తు సామగ్రి పంపిణీ, ప్రభుత్వ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న పేద రోగులకు అవసరమైన సామగ్రి అందజేయడం వంటి సేవా కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు రామ్ గోపాల్ పేర్కొన్నారు.

## ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార పౌర సంబంధాల శాఖది కీలక పాత్ర

: **ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక**

హైదరాబాద్, జూన్ 30 (సమయం న్యూస్) : ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు చేరవేయడంలో సమాచార పౌర సంబంధాల శాఖ కీలక పాత్ర పోషిస్తుందని I &PR ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక అన్నారు. సమాచార శాఖ ప్రధాన కార్యాలయంలో పౌర సంబంధాల అధికారి గా విధులు నిర్వర్తిస్తున్న ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ సోమవారం ఉద్యోగ విరమణ పొందారు. ఈ సందర్భంగా హైదరాబాద్ రాష్ట్ర సమాచార శాఖ కార్యాలయంలో PRO శ్రీనివాస్ కుమార్ ను కార్యాలయ అధికారులు, ఉద్యోగులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమానికి



ప్రత్యేక కమిషనర్ ముఖ్యఅతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రభుత్వానికి, ప్రజలకు వారధిగా నిలిచి ప్రభుత్వం చేపట్టిన ప్రతి కార్యక్రమాన్ని ప్రజలకు చేరవేసేందుకు సమాచార శాఖ అధికారులు నిరంతరం కృషి చేస్తున్నారన్నారు. సమాచార శాఖ కార్యాలయంలో PRO ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ తమ విధులను అంకితభావంతో సమర్థవంతంగా నిర్వర్తించారని I &PR ప్రత్యేక కమిషనర్ సి హెచ్ ప్రియాంక ప్రశంసించారు. ఉద్యోగ విరమణ మరొక కొత్త జీవితం అని అన్నారు. ఉద్యోగంలో ఉన్నప్పుడు వ్యక్తి గత జీవితాన్ని చాలా కోల్పోతామని, ఉద్యోగం విరమణ తర్వాత కుటుంబ సభ్యులతో ఆనందంగా గడపాలన్నారు. అనంతరం శ్రీనివాస్ కుమార్ కుటుంబ సభ్యులను ప్రత్యేక కమిషనర్ పరిచయం చేసుకున్నారు. సమాచార శాఖ PRO ముళ్ళపూడి శ్రీనివాస్ కుమార్ మాట్లాడుతూ తన 38 ఏండ్ల ఉద్యోగ జీవితం సంతృప్తిగా సాగిందన్నారు. అనేక పురస్కారాలు లభించాయన్నారు. చిత్తశుద్ధితో పని చేయడం వలన సమాచార శాఖ కు తాను చేసిన సేవల కంటే పొందినదే ఎక్కువ అని సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఇంచార్జీ అదనపు సంచాలకులు డి.ఎస్.జగన్, సంయుక్త సంచాలకులు కె.వెంకటరమణ, వెంకటేశ్వరావు, ఉప సంచాలకులు మధుసూధన్, వై వెంకటేశ్వర్లు, ప్రసాద్, హష్మీ, సమాచార శాఖ అధికారులు, ఉద్యోగులు పాల్గొన్నారు.



## కలెక్టర్ చేతుల మీదుగా నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ కాంపిటీషన్ గోడ ప్రతుల ఆవిష్కరణ

నిర్మల్ జూన్30(సమయం న్యూస్) : జిల్లా కలెక్టర్ అభిలాష అభినవ్ సోమవారం సాయంత్రం తన చాంబర్లో విద్యాశాఖ అధికారులతో కలిసి నేషనల్ స్టూడెంట్స్ పర్యావరణ కాంపిటీషన్ (ఎన్ఎస్ పిసి) గోడప్రతులను జిల్లా విద్యాశాఖ అధికారులతో కలిసి ఆవిష్కరించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, జూలై 1వ తేదీ నుంచి ఆగస్టు 21వ తేదీ వరకు పర్యావరణ పరిరక్షణకు సంబంధించి జిల్లా విద్యార్థులకు క్విజ్ పోటీలను నిర్వహించబడతాయని తెలిపారు. ఫలితాలు ఆగస్టు 30తేదీన విడుదల చేయబడతాయన్నారు. విద్యార్థుల్లో పాఠశాల స్థాయి నుంచే పర్యావరణ పరిరక్షణపై అవగాహన పెంపొందించడమే ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశమని పేర్కొన్నారు. విద్యార్థులందరినీ ఈ ఎన్ఎస్ పిసి కార్యక్రమంలో భాగస్వామ్యం చేయాలని అధికారులకు సూచించారు. ఈ కార్యక్రమంలో జిల్లా విద్యాశాఖ అధికారి పి.రామారావు, సైన్స్ అధికారి వినోద్, ఎన్ జి సి జిల్లా సమన్వయకర్త మోహన్ రావు, జిల్లా సమన్వయ కర్త నర్సయ్య, ఎస్టియు రాష్ట్ర బాధ్యులు గజేందర్, జిల్లా బాధ్యులు భూమన్న యాదవ్, లక్ష్మణ్, తదితరులు పాల్గొన్నారు.

## ఆపరేషన్ ముస్కాన్ - 11 ను విజయవంతం చేయాలి

* **జిల్లా పాలనాధికారి రాజర్షి షా**

ఆదిలాబాద్ జూన్30 (సమయం న్యూస్) : ఆపరేషన్ ముస్కాన్ ఫేజ్ XI, ఆపరేషన్ స్మైల్ పై బాలల రక్షణ విభాగం (ICPS), dwo ఆధ్వర్యం లో కన్వర్జెన్స్ సమావేశం కలెక్టర్ క్యాంప్ కార్యాలయం లో సోమవారం సాయంత్రం జిల్లా కలెక్టర్ రాజర్షి షా సంబంధిత లైన్ డిపార్ట్మెంట్ విభాగాలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ఈ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని, జూలై 1 నుంచి 31 వరకు ఆపరేషన్ ముస్కాన్‌ను అన్ని శాఖల అధికారుల సమన్వయంతో నిర్వహించాలన్నారు. ప్రతి అధికారి పక్కా ప్రణాళిక రూపొందించుకొని బాలకార్మిక వ్యవస్థను నిర్మూలించేలా కృషి చేయాలన్నారు. బాలకార్మికులు కనిపిస్తే 1098 కు వెంటనే సమాచారం అందించేలా ప్రజల్లో అవగాహన కల్పించాలన్నారు. బాల కార్మికులను పనిలో పెట్టుకున్న వారికి చట్ట ప్రకారం శిక్షలు పడే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. అదిలాబాద్, ఉట్నూర్ డివిజనల్ లో ఒక్కో బృందాన్ని ఏర్పాటు చేశామన్నారు. ఈ బృందాలు జిల్లా వ్యాప్తంగా ఉన్న ఇటుక బట్టీలు, వివిధ రకాల పరిశ్రమలు, బస్ స్టేషన్‌లు, ట్రాఫిక్ జంక్షన్‌ల వద్ద క్షుణ్ణంగా పరిశీలించాలన్నారు. కుటుంబాలకు దూరంగా ఉంటున్న పిల్లలను గుర్తించి తల్లిదండ్రుల వద్దకు చేర్చేలా ప్రణాళిక రూపొందించు కోవాలన్నారు. ఈ సందర్భంగా ఇటీవలే బాల కార్మికుడిని పనిలో పెట్టుకున్నందుకు ఓనర్ పై కేసు నమోదు చేయడం జరిగిందన్నారు. ఇలాంటి సంఘటనలు పునరావృతం కాకుండా సంబంధిత అధికారులు ప్రత్యేక చర్యలు చేపట్టి జిల్లాలో దుకాణాలను తనిఖీ చేసి బాల కార్మికులను గుర్తించి తగు చర్యలు తీసుకోవాలని ఆన్నారు. బడీడు పిల్లలను గుర్తించి పాఠశాలల్లో, హాస్టల్ లో, రెసిడెన్షియల్ స్కూల్ లో అడ్మిషన్ చేయించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. మిషన్ వాత్సల్య యాప్ లో అప్ లోడ్ చేయాలనీ ఆన్నారు. ఈ సందర్భంగా చైల్డ్ హెల్ప్ లైన్ కి ఇప్పటివరకు ఎన్ని కాల్స్ వచ్చాయి, చైల్డ్ మ్యారేజ్ లు ఎన్ని అయ్యాయి, చైల్డ్ బెగ్గింగ్ ఎంతమందిని గుర్తించారు,



గుర్తించి ఏం చర్యలు తీసుకున్నారని సంబంధిత అధికారులను అడిగి తెలుసుకొని దిశా నిర్దేశం చేశారు. ఆపరేషన్ ముస్కాన్ ముఖ్య ఉద్దేశం తప్పిపోయిన పిల్లలను తిరిగి వారి తల్లిదండ్రుల వద్దకు చేర్చుటకు దర్పన్ అప్ ఉపయోగించాలని సూచించారు. భిక్షాటన పిల్లలను వీధి బాలలను బాండెడ్ లేబర్ పిల్లలను గుర్తించి వారందరికి పునరావాసం కల్పిస్తూ పాఠశాలలో చేర్పించి పిల్లల భవిష్యత్తును చక్కదిద్దేలా ఆయా శాఖల సమన్వయంతో చర్యలు చేపట్టి ఈ ఆపరేషన్ ముష్కాన్ ను విజయవంతం చేయాలని ఆన్నారు. ఈ సమావేశం లో జిల్లా సంక్షేమ అధికారి మిల్కా, డిప్యూటీ లేబర్ కమిషనర్ ముత్యం రెడ్డి, జిల్లా విద్యాశాఖ అధికారి శ్రీనివాస్, జిల్లా బాలల సంరక్షణ అధికారి రాజేంద్రప్రసాద్, సిడబ్ల్యూసీ చైర్మన్ (చైల్డ్ వెల్ఫేర్ కమిటీ) వెంకట్ స్వామి, సభ్యులు దశరథ్, డేవిడ్, సమీరుల్లా ఖాన్, సిఐలు చంద్రశేఖర్, అంజమ్మ, పద్మ, గుణవంత్ రావు, ఎస్సై హకీం, చైల్డ్ హెల్ప్ లైన్ కోఆర్డినేటర్ సతీష్ కుమార్, ష్యూర్ ఎన్జీవో డిస్టిక్ కోఆర్డినేటర్ కె. వినోద్, డిసిపి యు సిబ్బంది పద్మ, అశ్విని, శ్రీకాంత్, వినోద్, ఉన్నారు.

## చెల్పూర్ మిల్లెట్ విక్రయానికి కలెక్టరేట్ లో షాపు ఏర్పాటుకు చర్యలు

* **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ**

జయ శంకర్ భూపాల పల్లి, జూన్ 30 (సమయం న్యూస్): చెల్పూర్ మిల్లెట్స్ విక్రయాలు నిర్వహణకు ఐడిఓసి కార్యాలయంలో క్యాబిన్ ఏర్పాటుకు చర్యలు తీసుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ డిఆర్డీఓకు సూచించారు. సోమవారం ఐడిఓసి కార్యాలయంలో చెల్పూర్ మిల్లెట్ యూనిట్ నిర్వహిస్తున్న మహిళలతో కలెక్టర్ ముకాముఖీ అయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేటి ప్రజల దైనందిన జీవనశైలిలో మిల్లెట్స్ వినియోగం ఆరోగ్య పరంగా ఎంతో ప్రాముఖ్యత సంతరించుకుందని తెలిపారు. అందుకే చెల్పూర్ మిల్లెట్ యూనిట్ ద్వారా తయారు చేస్తున్న ఉత్పత్తులకు మార్కెట్ విస్తరణ అవసరమున్నదని, ఇందుకోసం ప్రత్యేకంగా కలెక్టర్ కార్యాలయంలో మిల్లెట్ క్యాబిన్ ఏర్పాటు చేయాలని తెలిపారు. ఈ సందర్భంగా మిల్లెట్స్ విక్రయాలు, వ్యాపారం విస్తరణకు రుణాలు అవసరత, తదితర అంశాలను మహిళలతో చర్చించిన కలెక్టర్ అవసరమైన సదుపాయాలను కల్పించేందుకు చర్యలు చేపట్టాలని డిఆర్డీఓకు సూచించారు.

## కేంద్ర భీమా, ఉపాధి కల్పన కార్యక్రమాలను వినియోగించుకోవాలి

* **జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్**

మెదక్ జూన్ 30 (సమయం న్యూస్) : కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఉపాధి కల్పన, బీమా పథకాలను ప్రజలు వినియోగించుకోవాలని జిల్లా కలెక్టర్ రాహుల్ రాజ్ తెలిపారు. సోమవారం ప్రజావాణి సమావేశ హాలులో కేంద్ర ప్రభుత్వ ప్రవేశపెట్టి ప్రవేశపెట్టిన పథకాలపై లీడ్ బ్యాంకు మేనేజర్ నరసింహమూర్తి ఇతర అధికారులతో సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ యువతకు ఉపాధి అవకాశాల కల్పన కోసం ప్రధానమంత్రి ఉపాధి కల్పన పథకం (పి.ఎం.ఈ.జి.పి), పేదలకు జీవిత బీమా కల్పించేందుకు ప్రధాన మంత్రి జీవన్ జ్యోతి యోజన (పి.ఎం.జే.జే.బీ.వై), ప్రమాద బీమా కల్పించేందుకు ప్రధానమంత్రి సురక్ష బీమా యోజన (పి.ఎం.ఎస్.బీ.వై) ప్రధానమంత్రి జన్ ధన్






యోజన పథకాలను అమలు చేస్తుందని అన్నారు. మూడు నెలలు 01.07.2025 నుండి 30.09.2025 వరకు ప్రతీ గ్రామ పంచాయతీ లో క్యాంప్ లు నిర్వహించవలసినది గా బ్యాంకులను ఆదేశించారు. దానికి అనుగుణంగా రోజు వారి క్యాంప్ లు నిర్వహించ వలసిన గ్రామ పంచతి షెడ్యూల్ లీడ్ బ్యాంక్ మేనేజర్ శ్రీ నరసింహ మూర్తి తయారు చేసి జిల్లా కలెక్టర్ గారి ఆధ్వర్యంలో లో జిల్లా అధికారులకి అందచేయటం జరిగినది. అన్ని డిపార్ట్మెంట్స్ బ్యాంక్ లకు సహకరించి క్యాంప్ లు విజయవంతంచేయాలని ఆదేశించారు. ముఖ్యంగా ఇందులో మహిళా సంఘ సభ్యులను, జాతీయ గ్రామీణ ఉపాధి పథకం కూలీలను, ఎన్రోల్మెంట్ చేసే విధంగా మెప్మా, జిల్లా గ్రామీణ అభివృద్ధి శాఖ, సంక్షేమ శాఖ సమన్వయంతో వ్యవహరించాలని చెప్పారు. ఇదే కాకుండా వివిధ శాఖలలో పనిచేయుచున్న కిందిస్థాయి సిబ్బందిని కూడా ఈ పథకాల పూర్వపరాలు తెలియపరచాలన్నారు.

# బాలల భవిష్యత్తు, బంగారు బాటలకు ప్రత్యేక శ్రద్ధ పెట్టండి

* **జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్**





వికారాబాద్ జూన్30(సమయం న్యూస్) : బాలల భవిష్యత్తుకు బంగారు బాటలు వేసే విధంగా అధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ప్రతీక్ జైన్ తెలిపారు. సోమవారం కలెక్టరేట్ లోని కాన్ఫరెన్స్ హాల్లో జులై మాసంలో నిర్వహించే ప్రత్యేక ఆపరేషన్ స్మైల్ కార్యక్రమంలో భాగంగా వివిధ శాఖల అధికారులతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... జిల్లాలో అక్రమ రవాణాకు గురవుతున్న, తప్పిపోయిన పిల్లలను గుర్తించే దిశగా సంబంధిత శాఖల అధికారులు అందరూ భాగస్వాములై పనిచేయాలన్నారు. బాల కార్మికుల నిర్మూలనకు సంబంధిత శాఖల అధికారులు ప్రత్యేక దృష్టిని సారించి బాల కార్మికులు లేని జిల్లాగా తీర్చిదిద్దాలని కలెక్టర్ తెలిపారు. బాలల పరిరక్షణ, సర్వతో ముఖాభివృద్ధికి అధికారులు తమ తోడ్పాటును అందించాలని కలెక్టర్ తెలిపారు. తప్పిపోయిన పిల్లందరినీ గుర్తించి తల్లిదండ్రులకు అప్పగించడమే కాకుండా ఉపాధి అవకాశాల నిమిత్తం వృత్తి కోర్సులలో శిక్షణకై సన్నద్ధులను చేయాలని కలెక్టర్ సూచించారు. మతిస్థిమితం లోపం ఉన్న వారిని పునరావాస కేంద్రాలలో ఆశ్రయం కల్పించి మానసిక వైద్యుల ద్వారా పరీక్షలను నిర్వహించి వైద్య సేవలు అందించాలని ఆయన తెలిపారు. బాల బాలికలను పనుల్లో పెట్టుకోవడం చట్ట రిత్యా నేరమనే విషయాన్ని యాజమానులకు తెలిసే విధంగా అవగాహన కల్పించాలని ఆయన తెలిపారు. ఈ సమావేశంలో అదనపు కలెక్టర్ ఎం.సుధీర్, అసిస్టెంట్ ట్రైనీ కలెక్టర్ హర్ష చౌదరి, డిడబ్లుఓ కృష్ణవేణి, చైల్డ్ వెల్ఫేర్ కమిటీ చైర్మన్ వెంకటేశం, కార్మిక శాఖ అసిస్టెంట్ కమిషనర్ వాల్యా నాయక్, అడిషనల్ ఎస్పీ (డిటిసి) మురళీధర్, డిసిపిఓ శ్రీకాంత్, బాలల పరిరక్షణ, చైల్డ్ లైన్ సిబ్బంది, స్వచ్ఛంద సంస్థల ప్రతిదులు పాల్గొన్నారు.



## కంజర్ పాఠశాలను తనిఖీ చేసిన కలెక్టర్

నిజామాబాద్, జూన్ 30 (సమయం న్యూస్) : మోపాల్ మండలం కంజర్ గ్రామంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి సోమవారం ఆకస్మికంగా తనిఖీ చేశారు. అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీ ఆధ్వర్యంలో పాఠశాలలో చేపట్టిన పనుల గురించి ప్రధానోపాధ్యాయుడిని వివరాలు అడిగి తెలుసుకున్నారు. రూ. 11.20 లక్షల నిధులు మంజూరు కాగా, తాగునీటి వసతి, విద్యుత్, ఫ్లోరింగ్ తదితర ప్రతిపాదిత పనులన్నీ పూర్తి అయ్యాయని హెచ్.ఎం గోపాలచారి తెలిపారు. ఈ సందర్భంగా కలెక్టర్ రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విద్యార్థుల సంఖ్యకు అనుగుణంగా అన్ని సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఇంకా ఏమైనా వసతులు అవసరమైతే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. కలెక్టర్ వెంట డీఈఓ అశోక్, ఎంపీడీఓ రాములు తదితరులు ఉన్నారు.

# పాశ మైలారం సిగాచి పరిశ్రమను సందర్శించిన మంత్రి గడ్డం వివేక్

* **మృతుల కుటుంబాలకు, క్షతగాత్రులకు మెరుగైన ఎక్స్‌గ్రేషియా .. మంత్రి హామీ..**
* **బాధిత కుటుంబాలకు అండగా ఉంటాం..**
* **పరిశ్రమల శాఖ అధికారుల ద్వారా విచారణ. రాష్ట్ర కార్మిక శాఖ మంత్రి గడ్డం వివేక్**



సంగారెడ్డి జూన్30(సమయం న్యూస్) : సంగారెడ్డి జిల్లా పాశ మైలారం పారిశ్రామిక వాడలోని సిగాచి ఫార్మా పరిశ్రమలో జరిగిన ప్రమాద స్థలాన్ని రాష్ట్ర కార్మిక శాఖ, ఉమ్మడి మెదక్ జిల్లా ఇంచార్జ్ మంత్రి గడ్డం వివేక్ సోమవారం పరిశీలించారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ... రియాక్టర్ పేలుడు వల్ల కాదు, ఎయిర్ ఫైర్ సిస్టమ్‌లో ప్రెషర్ వల్లే ఈ ప్రమాదం చోటు చేసుకుంది. ఇప్పటికే పరిశ్రమల శాఖ అధికారుల ద్వారా విచారణ ప్రారంభమైంది అని తెలిపారు. వైద్య ఆరోగ్యశాఖ మంత్రి దామోదర్ రాజనర్సింహాతో కలిసి విలేకరులతో మాట్లాడారు. ఈ ప్రమాదంలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన కార్మికులకు ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ప్రభుత్వం తరపున మెరుగైన ఎక్స్‌గ్రేషియా (సహాయ నిధి) అందించడంతో పాటు క్షతగాత్రులకు ఉత్తమ వైద్య సౌకర్యాలు కల్పిస్తామని పేర్కొన్నారు. ఈ తరహా ఘటనలు మళ్లీ జరగకుండా పరిశ్రమల్లో అవసరమైన భద్రతా చర్యలు తప్పనిసరిగా అమలుచేస్తామని మంత్రి స్పష్టం చేశారు. ప్రమాద స్థలంలో మంత్రి జిల్లా కలెక్టర్, ఎస్పీతో మాట్లాడి పూర్తి వివరాలను అడిగి తెలుసుకున్నారు. క్షతగాత్రులకు తగిన వైద్యం అందించేందుకు తక్షణ చర్యలు చేపట్టాలని అధికారులు, వైద్య శాఖను ఆదేశించారు.




## బ్యాంకులో చోరీకి పాల్పడ్డ దుండగులు

వెల్దుర్తి జూన్ 30, సమయం న్యూస్: వెల్దుర్తి పట్టణంలోని సెంట్రల్ బ్యాంక్ లో చోరీకి ప్రయత్నించిన ఘటన సోమవారం తెల్లవారుజామున 3 గంటలకు వెలుగు చూసింది. దుండగులు బ్యాంకు ప్రహరీ గోడ దూకి బ్యాంకు వెనుక వైపు గోడకు కన్నం వేసి బ్యాంకులోకి ప్రవేశించారు. స్ట్రాంగ్ రూమ్ లోకి ప్రవేశించే క్రమంలో బ్యాంకులో ఉన్న ఎమర్జెన్సీ అలారం మోగడం వలన ఫలితం లేకపోవడంతో దుండగులు అక్కడి నుండి పారిపోయారు. అలారం మోగడంతో స్థానికులు సోమవారం స్థానిక పోలీసులకు ఫిర్యాదు చేశారు.



తూప్రాన్ డీఎస్పీ నరేందర్ గౌడ్,సిఐ రంగా కృష్ణ అప్రమత్తమై ఘటన స్థలానికి చేరుకొని విచారణ చేపట్టారు. కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు. బ్యాంకులో ఎలాంటి నగదు, వస్తువులు పోలేదని బ్యాంక్ సిబ్బంది తెలిపారు.

# ప్రభుత్వ ఆసుపత్రి సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలి

* **జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే**





ఆసిఫాబాద్ జిల్లా. జూన్30 (సమయం న్యూస్) : జిల్లాలోని ప్రభుత్వ ఆసుపత్రులు, ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలలో వైద్యులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని జిల్లా కలెక్టర్ వెంకటేష్ దోత్రే అన్నారు. సోమవారం జిల్లాలోని రెబ్బెన మండల కేంద్రంలో గల ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి సీతారాం తో కలిసి ఆకస్మికంగా సందర్శించి ఆసుపత్రిలోని వార్డులు, ల్యాబ్, పరిసరాలను పరిశీలించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో అవసరమైన మందులు అందుబాటులో ఉంచుకోవాలని, ఆసుపత్రి పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలని, వైద్య సేవల కొరకు వచ్చే ప్రజలకు సకాలంలో మెరుగైన వైద్య సేవలు అందించాలని తెలిపారు. ప్రజల పట్ల బాధ్యతగా వ్యవహరించాలని, విధుల పట్ల సమయపాలన పాటించాలని తెలిపారు. అనంతరం మండల కేంద్రంలోని తహసిల్దార్ కార్యాలయ ప్రాంగణంలో నిర్మిస్తున్న నమూనా ఇందిరమ్మ ఇంటి నిర్మాణ పనులను హౌసింగ్ పి. డి. వేణుగోపాల్ తో కలిసి పరిశీలించారు. నమూనా ఇందిరమ్మ ఇంటిని త్వరగా పూర్తిచేసి లబ్ధిదారులకు చూపించి ఇదే నమూనాలో ఇంటి నిర్మాణం చేపట్టే విధంగా అవగాహన కల్పించాలని, మండలానికి మంజూరైన ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణం త్వరగా ప్రారంభించేలా అధికారులు పర్యవేక్షించాలని తెలిపారు. ప్రభుత్వం ఇందిరమ్మ ఇండ్ల నిర్మాణానికి ఇసుకను ఉచితంగా అందిస్తుందని, త్వరగా గ్రౌండింగ్ చేపట్టాలని తెలిపారు. మండల కేంద్రంలోని రెబ్బెన ఆగ్రో సీడ్స్ ఫర్టిలైజర్ షాపును తనిఖీ చేసి స్టాకు రిజిస్టర్ లను పరిశీలించారు. రైతులకు సాగుకు సరిపడా యూరియా నిల్వలను సీజన్ ను బట్టి అందుబాటులో ఉంచాలని, కొనుగోలు చేసిన రైతులకు రసీదులు జారీ చేయాలని, యూరియా కొరత లేకుండా చూడాలని, అధిక ధరలకు విక్రయించినట్లయితే కేసులు నమోదు చేసి చర్యలు తీసుకుంటామని తెలిపారు. మండల కేంద్రంలోని సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాల, కళాశాల ను సందర్శించి వంటశాలను పరిశీలించి సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెనూ ప్రకారం సకాలంలో పోషక విలువలు కలిగిన ఆహారాన్ని అందించాలని, ఆహారం తయారు చేసే సమయంలో తాజా కూరగాయలు, నాణ్యమైన నిత్యవసర సరుకులను వినియోగించాలని తెలిపారు. ప్రతి ప్రభుత్వ పాఠశాలలను త్రాగునీరు, విద్యుత్, మూత్రశాలలు ఇతర మౌలిక సదుపాయాలు కల్పించాలని, పారిశుధ్య నిర్వహణ పకడ్బందీగా చేపట్టాలని తెలిపారు. విద్యార్థుల ఆరోగ్యం పై ప్రత్యేక దృష్టి సారించాలని, విద్యార్థులకు నాణ్యమైన విద్య బోధన అందించాలని తెలిపారు. ఉపాధ్యాయులు, సిబ్బంది విధులలో సమయపాలన పాటించాలని తెలిపారు. విద్యార్థులతో మాట్లాడుతూ వారికి అందుతున్న సౌకర్యాలు, విద్యాబోధన అంశాలపై వివరాలు అడిగి తెలుసుకున్నారు. ఈ కార్యక్రమంలో తహసిల్దార్ సూర్యప్రకాష్, మండల వ్యవసాయ శాఖ అధికారి, ప్రిన్సిపాల్, సిబ్బంది పాల్గొన్నారు.



## ఉత్తమ వైద్యాధికారి అవార్డులతో డాక్టర్ ఎం. మనోజ్ రెడ్డికి ఘన సత్కారం





హైదరాబాద్, జూన్ 30: ఆరోగ్య సేవల రంగంలో అత్యుత్తమ సేవలు అందిస్తున్న డాక్టర్ ఎం. మనోజ్ రెడ్డి నాలుగు సార్లు "ఉత్తమ వైద్యాధికారి అవార్డు" అందుకుని విశేష గౌరవం పొందారు. ఆయనకు నిమ్స్ సహా వివిధ ప్రభుత్వ కార్యక్రమాల్లో ఈ పురస్కారాలు లభించాయి. వివరాల్లోకి వెళితే: 2017 జనవరి 26న నిమ్స్ ఆసుపత్రిలో గణతంత్ర దినోత్సవ వేడుకల్లో ఉత్తమ వైద్యాధికారి అవార్డు అందుకున్నారు. ఆ తరువాత 2021 22 సంవత్సరానికి గాను 2022 ఆగస్టు 15న స్వాతంత్ర్య దినోత్సవం సందర్భంగా మరోసారి ఉత్తమ వైద్యాధికారి అవార్డు లభించింది. 2023 జూన్ 14న ప్రపంచ జనాభా దినోత్సవాన్ని పురస్కరించుకుని నిర్వహించిన కార్యక్రమంలో ఆయన సేవలను గుర్తించి మూడోసారి ఉత్తమ వైద్యాధికారి అవార్డును అందించారు. తాజాగా 2024 జనవరి 26న హైదరాబాద్ కలెక్టర్ చేతుల మీదుగా నాలుగోసారి ఉత్తమ వైద్యాధికారి అవార్డు అందుకున్నారు. ప్రజల ఆరోగ్య పరిరక్షణలో ఆయన చేస్తున్న కృషికి పలువురు అధికారులు, ప్రజా ప్రతినిధులు అభినందనలు తెలిపారు. ఆయన సేవలతో మరింత మందికి వైద్య సహాయం అందించాలని కోరారు.

# పదవి విరమణ పొందిన టైపిస్టు మసూద్

* **జిల్లా ఇంఛార్జి పౌర సంబంధాల అధికారి బి.జగన్**
* **టైపిస్టు మసూద్ కు ఘన సన్మానం**



పెద్దపల్లి, జూన్ 30 (సమయం న్యూస్): జిల్లా పౌర సంబంధాల అధికారి కార్యాలయంలో టైపిస్టు గా పని చేస్తున్న ఎం.డి మసూద్ నేడు సోమవారం 61 సంవత్సరాల వయస్సు నిండిన నేపథ్యంలో పదవి విరమణ పొందారని జిల్లా ఇంఛార్జి పౌర సంబంధాల అధికారి బి.జగన్ తెలిపారు. సోమవారం జిల్లా ఇంఛార్జి పౌర సంబంధాల అధికారి బి.జగన్ సమీకృత జిల్లా కలెక్టరేట్ లోని డి.పి.ఆర్.ఓ కార్యాలయంలో పదవి విరమణ పొందుతున్న టైపిస్టు మసూద్ కు ఏర్పాటు చేసిన సన్మాన కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా ఇంఛార్జి పౌర సంబంధాల అధికారి బి.జగన్ మాట్లాడుతూ, గత 29 సంవత్సరాలుగా పెద్దపల్లి జిల్లా సమాచార పౌర సంబంధాల శాఖలో ఎం.డి. మసూద్ తన సేవలను నిర్విరామంగా అందించి నేడు పదవి విరమణ పొందుతున్నారని తెలిపారు. పదవి విరమణ జీవితంలో చాలా కీలకమైన ఘట్టమని అన్నారు. 29 సంవత్సరాల పాటు ప్రభుత్వ రంగంలో సేవలు అందించడం చాలా గొప్ప విషయం అని అన్నారు. జీవితంలో ఒక ముఖ్యమైన భాగం ముగిసి, మరో అంకానికి ప్రారంభం అవుతుందని అన్నారు. ప్రజలకు వివిధ దశలలో దశాబ్దాల పాటు సేవలు అందించిన ఎం.డి. మసూద్, వారి కుటుంబ సభ్యులకు భగవంతుని ఆశీస్సులు ఉండాలని, మిగిలిన జీవితం ప్రశాంతంగా గడవాలని కోరుకుంటున్నట్లు ఇంచార్జి డి.పి.ఆర్.ఓ తెలిపారు. దశాబ్దాల కాలంగా ప్రజలకు సేవలు అందించి నేడు పదవి విరమణ పొందుతున్న ఎం.డి. మసూద్, వారి కుటుంబ సభ్యులకు ఇంచార్జి డి.పి. ఆర్.ఓ కృతజ్ఞతలు తెలియజేశారు. పదవి విరమణ పొందుతున్న ఎం.డి. మసూద్ మాట్లాడుతూ, టైపిస్ట్ గా పౌరసంబంధాల అధికారి కార్యాలయంలో సేవలు అందించడంలో తనకు సహకరించిన అధికారులకు, సిబ్బంది, పాత్రికేయులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం పదవి విరమణ పొందిన టైపిస్టు ఎం.డి. మసూద్ కు పౌరసంబంధాల అధికారి కార్యాలయ సిబ్బంది, బంధుమిత్రులు ఘనంగా సన్మానించారు. ఈ కార్యక్రమంలో డి.పిఆర్.ఓ స్టాఫ్, బంధు మిత్రులు, తదితరులు పాల్గొన్నారు.

# ఎస్సెస్సీ టాపర్లను సన్మానించిన ఎమ్మెల్యేలు, కలెక్టర్



నిజామాబాద్, జూన్ 30 (సమయం న్యూస్): పదవ తరగతి 2024 2025 వార్షిక పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించి టాపర్లుగా నిలిచిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థిని, విద్యార్థులను జిల్లా విద్యా శాఖ ఆధ్వర్యంలో బోధన్ ఎమ్మెల్యే పి.సుదర్శన్ రెడ్డి, నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే డాక్టర్ భూపతి రెడ్డి, కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి ఘనంగా సన్మానించారు. సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలోని ప్రధాన సమావేశ మందిరంలో సోమవారం సన్మాన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా బోధన్ ఎమ్మెల్యే సుదర్శన్ రెడ్డి మాట్లాడుతూ, ప్రభుత్వ పాఠశాలల్లో నిష్ణాతులైన ఉపాధ్యాయులు ఉన్నారని, అంకితభావంతో విధులు నిర్వర్తిస్తూ నాణ్యమైన విద్యను బోధిస్తే మరింత మెరుగైన ఫలితాలు వస్తాయని అన్నారు. ఇదివరకటితో పోలిస్తే ప్రభుత్వ బడులలో ఉత్తీర్ణత ఎంతో మెరుగుపడిందని, ఇదే స్ఫూర్తితో వచ్చే విద్యా సంవత్సరం మరింత మెరుగైన ఫలితాలు సాధించేందుకు కృషి చేయాలని హితవు పలికారు. ప్రత్యేకించి ప్రభుత్వ బడుల నిర్వహణ మెరుగయ్యేలా మహిళా ఉపాధ్యాయులు ప్రత్యేక చొరవ చూపాలని, తమ సొంత ఇంటిని తీర్చిదిద్దుకునే విధంగానే సర్కారీ బడులలో ప్రమాణాలు మెరుగుపడేలా చొరవ చూపాలన్నారు. అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో అమ్మ ఆదర్శ పాఠశాల కమిటీల ఆధ్వర్యంలో సదుపాయాల మెరుగుదల కోసం ప్రభుత్వం కోట్లాది రూపాయల నిధులను వెచ్చిస్తోందని, దీనిని దృష్టిలో పెట్టుకుని అన్ని బడులలో విద్యార్థుల సంఖ్య గణనీయంగా పెరిగేలా చూడాలన్నారు. చక్కగా పనిచేసే వారిని తప్పనిసరిగా ప్రోత్సహిస్తామని, ప్రతి ఒక్కరు తమ విధులకు పూర్తి న్యాయం చేస్తూ, విద్యార్థుల బంగారు భవిష్యత్తుకు బాటలు వేయాలని సూచించారు. నిజామాబాద్ రూరల్ ఎమ్మెల్యే భూపతి రెడ్డి మాట్లాడుతూ, విద్యా, క్రీడ, పర్యాటక రంగాలకు ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలోని రాష్ట్ర ప్రభుత్వం అధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. ప్రభుత్వ అభిమతానికి అనుగుణంగా ప్రతి పాఠశాలలో సౌకర్యాలు, విద్యా బోధన మెరుగుపడేలా కృషి చేయాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. ప్రైవేట్, కార్పొరేట్ పాఠశాలలు సైతం ప్రభుత్వ బడులను ఆదర్శంగా తీసుకునేలా తీర్చిదిద్దాలని అన్నారు. ఉజ్వల భవిష్యత్తు కలిగిన విద్యార్థులు మత్తు పదార్థాలు, మాదకద్రవ్యాలు వంటి వాటి బారిన పడకుండా అన్ని జాగ్రత్తలు తీసుకోవాలని, ఈ విషయంలో సీఎం ప్రత్యేక దృష్టిని కేంద్రీకరిస్తున్నారని అన్నారు. చాలాకాలం నుండి పెండింగ్ లో ఉన్న ఉపాధ్యాయుల బదిలీలు, పదోన్నతుల ప్రక్రియను ఇటీవలే ప్రభుత్వం పూర్తి చేసిందని గుర్తు చేశారు. కలెక్టర్ టి.వినయ్ కృష్ణారెడ్డి మాట్లాడుతూ, ఇదివరకటి రెండు సంవత్సరాలలో పోలిస్తే, ఈసారి పదవ తరగతిలో జిల్లాలో సగటు ఉత్తీర్ణత మెరుగుపడిందని అన్నారు. ప్రస్తుత విద్యా సంవత్సరంలో మరింత మెరుగైన ఫలితాల సాధన కోసం ఇప్పటినుండే నాణ్యమైన విద్యా బోధనపై దృష్టిని కేంద్రీకరించాలని విద్యా శాఖ అధికారులకు సూచించారు. గణితం, ఆంగ్లం, సామాన్య శాస్త్రం వంటి సబ్జెక్టులలో వెనుకబడిన విద్యార్థులను గుర్తించి, ప్రత్యేక తరగతులు నిర్వహించాలని అన్నారు. మండల స్పెషల్ ఆఫీసర్లు, జిల్లా అధికారులకు క్రమం తప్పకుండా ప్రభుత్వ పాఠశాలలను సందర్శిస్తూ, నిర్వహణ తీరును నిశితంగా పరిశీలించేలా చర్యలు తీసుకున్నామని తెలిపారు. ప్రతి పాఠశాలలో కనీస మౌలిక సదుపాయాలు అందుబాటులో ఉండేలా చర్యలు తీసుకోవాలని, ఎక్కడైనా వసతుల కొరత ఉంటే ప్రతిపాదనలు పంపాలని సూచించారు. ఎస్సెస్సీలో మెరుగైన ఫలితాల సాధన, అందుబాటులోకి వచ్చిన సౌకర్యాలు, నాణ్యమైన విద్యా బోధన గురించి విస్తృతంగా ప్రచారం చేస్తూ విద్యార్థులను ప్రభుత్వ పాఠశాలల్లో చేర్పించేలా చూడాలన్నారు. ఎస్సెస్సీలో 586 మార్కులు సాధించిన డొంకేశ్వర్ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలకు చెందిన తోట రక్షితను అభినందిస్తూ ముఖ్య అతిథులు సత్కరించారు. అలాగే, 584 మార్కులు సాధించిన ఓరగంటి గంగాగోపాల్, గట్టు షైనీ, 582 మార్కులు పొందిన ఎస్.దీప్తి, డి.వైశాలి, 579 మార్కులు సాధించిన వై.కీర్తన, 577 మార్కులు సాధించిన అలేఖ్య, వై.గ్రీష్మ, జంగిటి అక్షరలను ఎమ్మెల్యేలు, కలెక్టర్ ఘనంగా సన్మానించారు. వంద శాతం ఉత్తీర్ణత సాధించిన పల్లికొండ, డొంకేశ్వర్, రాంపూర్, మెండోరా, అమ్రాద్, చౌట్పల్లి, జక్రాన్పల్లి, మోస్రా, కల్దెడి, రెంజల్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలల ప్రధానోపాధ్యాయులను కూడా సత్కరించారు. ప్రభుత్వ బడులలో అత్యధికంగా విద్యార్థులను చేర్పించిన బోర్గం(పి) హైస్కూల్, బోధన్ రాకాసిపేట్ బాలికల ఉన్నత పాఠశాల, చిట్టాపూర్ ప్రైమరీ స్కూల్, తుంపల్లి ప్రైమరీ స్కూల్, ఫులాంగ్ బాలుర ఉన్నతర ప్రాథమిక పాఠశాలల హెచ్.ఎంలను కూడా సత్కరించారు. సోమవారం నాటితో పదవీ విరమణ చేసిన ముగ్గురు ఎంఈఓలు, ముగ్గురు హెచ్.ఎం లను ఘనంగా సన్మానించి వీడ్కోలు తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఉర్దూ అకాడమీ చైర్మన్ తాహెర్ బిన్ హందాన్, రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్ రెడ్డి, రాష్ట్ర వ్యవసాయ, రైతు కమిషన్ సభ్యుడు గడుగు గంగాధర్, జిల్లా గ్రంథాలయ సంస్థ చైర్మన్ అంతిరెడ్డి రాజిరెడ్డి, అదనపు కలెక్టర్ అంకిత్, జిల్లా విద్యాశాఖ అధికారి పి.అశోక్, ఎం.ఈ.ఓలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, గజిటెడ్ హెచ్.ఎంలు, కాంప్లెక్ హెచ్.ఎంలు, ఎంఆర్పీలు, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.



## అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తాం

* **రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్**
* **ధర్మారం మండలంలోని నంది మేడారం ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ చేసిన మంత్రి**

ధర్మారం, జూన్ 30 (సమయం న్యూస్) : అర్హులైన నిరుపేదలకు ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తామని రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ అన్నారు. సోమవారం ధర్మారం మండలంలోని నంది మేడారం లో ఇందిరమ్మ ఇండ్ల లబ్ధిదారులకు మంజూరు పత్రాలను పంపిణీ కార్యక్రమంలో రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా రాష్ట్ర సంక్షేమ శాఖ మంత్రివర్యులు అడ్లూరి లక్ష్మణ్ కుమార్ మాట్లాడుతూ, ఏసిడిపి నిధులు సరిపోని పక్షంలో నంది మేడారం గ్రామంలో అభివృద్ధి పనులకు కలెక్టరేట్ నిధుల నుంచి 3 కోట్ల కలెక్టర్ మంజూరు చేశారని అన్నారు. కోటి 30 లక్షల రూపాయలను నంది మేడారం గ్రామంలో అభివృద్ధి పనులకు కేటాయించామని అన్నారు. నంది మేడారం గ్రామంలో 261 విద్యుత్ పోల్స్ తరలింపు కోసం 26 లక్షల రూపాయలు మంజూరు చేసామని అన్నారు. 80 లక్షల రూపాయల విలువ గల అంతర్గత సిసి రోడ్లు వేసుకున్నామని, మేడారం నుంచి కట్కెనపల్లి, కోర్టు వరకు సీసీ రోడ్డు పనులు నెల రోజులలో మంజూరు చేస్తామని అన్నారు. నంది మేడారం గ్రామంలో అర్హులైన 80 మంది నిరుపేదలకు మొదటి విడత కింద ఇందిరమ్మ ఇండ్లు మంజూరు చేస్తున్నామని, ఇంకా ఎవరైనా అర్హులు ఉన్న తప్పనిసరిగా ఇండ్లు మంజూరు అవుతాయని, ఎవరు బాధపడాల్సిన అవసరం లేదని అన్నారు. స్థలం లేని నిరుపేదలకు ప్రభుత్వ ఇంటి స్థలం కేటాయించి ఇందిరమ్మ ఇండ్ల మంజూరు చేసే ఆలోచన చేస్తున్నామని అన్నారు. ఇందిరా మహిళా శక్తి కార్యక్రమం కింద మహిళా సంఘాల ద్వారా బస్సు కొనుగోలు చేసి ఆర్టీసీ కు అద్దె కు పెట్టడం జరిగిందని, దీనివల్ల ప్రతి నెల 46 వేల రూపాయల ఆదాయం లభిస్తుందని అన్నారు. పేదలకు రేషన్ ద్వారా సన్న బియ్యం సరఫరా, 200 యూనిట్లు ఉచిత విద్యుత్, మహిళలకు ఉచిత బస్సు ప్రయాణం, రైతు భరోసా, రుణమాఫీ వంటి అనేక సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నామని అన్నారు. ఈ కార్యక్రమంలో రెవెన్యూ డివిజన్ అధికారి బి .గంగయ్య, పీడీ హౌసింగ్ రాజేశ్వర్ రావు, మార్కెట్ కమిటీ చైర్మన్, వైస్ చైర్మన్ లింగమూర్తి, ధర్మారం తహసిల్దార్, ప్రజా ప్రతినిధులు, సంబంధిత అధికారులు, తదితరులు పాల్గొన్నారు.

## భూభారతి సదస్సు దరఖాస్తులకు అత్యంత ప్రాధాన్యత

* **జిల్లా కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్**

జనగాం జూన్30 (సమయం న్యూస్) : భూభారతి పోర్టల్ లో సమస్యలను పరిష్కరించేందుకు చాలా అవకాశాలు ఉన్నాయని... రెవెన్యూ సదస్సు లో వచ్చిన దరఖాస్తు లను త్వరతగతిన పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ రిజ్వాన్ భాషా షేక్ అన్నారు. రెవెన్యూ కు సంబంధించిన వివిధ అంశాల పైన అదనపు కలెక్టర్ రోహిత్ సింగ్ తో కలిసి స్పెషల్ డిప్యూటీ కలెక్టర్లు ఆర్డిఓ, తాసిల్దారులతో కలెక్టరేట్లోని మినీ కాన్ఫరెన్స్ హాల్లో కలెక్టర్ రిజ్వాన్ బాషా షేక్ రివ్యూ నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ... రెవెన్యూ సదస్సులో వచ్చిన ప్రతి దరఖాస్తును నిషితంగా పరిశీలించి... సాధ్యమైనంత వరకు అన్ని దరఖాస్తులను పరిష్కరించేందుకు కృషిచేయాలన్నారు. దరఖాస్తులను పరిష్కరించే క్రమంలో టెక్నికల్ లేక ఇతర సమస్య ఎదురైతే రాష్ట్రస్థాయి నుండి వెను వెంటనే సహకరించేందుకు టీం సిద్ధంగా ఉందన్నారు. ఏదైనా దరఖాస్తులకు సర్వే అవసరమైతే మండలాల వారిగా సపరేట్ గా పెట్టుకోవాలని... ల్యాండ్ అండ్ సర్వే డిపార్ట్మెంట్ వారి ద్వారా అట్టి వాటికి సర్వే ని నిర్వహిస్తమన్నారు. జాతీయ సాంఘిక కుటుంబ ప్రయోజనం కింద వచ్చిన దరఖాస్తు లకు సంబందించి తొందరగా వెంటనే విచారణ చేసి ప్రతిపాదనలని పంపించాలన్నారు. సీఎం ప్రజావాణి కి ప్రాధాన్యత ఇవ్వాలని.... మండల స్థాయిలోనే సమస్య లను తొందరగా పరిష్కరిస్తే జిల్లా స్థాయిలో జరిగే గ్రీవెన్స్ కి తక్కువ మంది వచ్చే అవకాశం ఉంటుందన్నారు. ప్రజలకు కూడా సౌలభ్యం గా ఉంటుందన్నారు. తహసీల్దార్ స్థాయిలో జారీ చేసే కుల, ఆదాయం తదితర సర్టిఫికెట్ లను నిర్దేశిత గడువు లోగా ఇవ్వాలన్నారు. ముఖ్యంగా కొత్త విద్యా సంవత్సరం



ప్రారంభం అయినందున విద్యార్థులకు అవసరమైన సర్టిఫికెట్ లను త్వరగా జారీ చేయాలన్నారు.

## ఇస్కాన్ ఆధ్వర్యంలో అత్తాపూర్‌లో వైభవోపేతంగా శ్రీ జగన్నాథ రథయాత్ర

* **శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి దివ్య రథాల ఊరేగింపు**
* **తరలివచ్చిన 10 వేల మంది భక్తులు**
* **హరినామ సంకీర్తన, భక్తి నృత్య ప్రదర్శనలు**
* **భక్తులకు మహా ప్రసాదం పంపిణి**

హైదరాబాద్, జూన్ 29, (సమయం న్యూస్) : ఇంటర్నేషనల్ సొసైటీ ఫర్ కృష్ణ కాన్షియస్‌నెస్ (ఇస్కాన్) అత్తాపూర్ ఆధ్వర్యంలో, 4వ వార్షిక శ్రీ జగన్నాథ రథయాత్ర మహోత్సవం 2025 జూన్ 29న హైదరాబాద్‌లోని అత్తాపూర్‌లో అత్యంత వైభవంగా నిర్వహించారు. ఈ ఆధ్యాత్మిక ఉత్సవంలో ఆలయ గర్భగుడిలోని శ్రీ జగన్నాథుడు, బలభద్రుడు, సుభద్ర దేవి బయటకు వచ్చి, దివ్య రథాలపై ఊరేగింపుతో భక్తులకు దర్శనం ఇచ్చారు. ఈ రథయాత్ర అత్తాపూర్‌లోని ఇస్కాన్ ఆలయం నుండి మధ్యాహ్నం 1 గంటకు ప్రారంభమై, సాయంత్రం 6 గంటలకు అత్తాపూర్‌లోని పిల్లర్ నెంబర్ 173, సామ భూపాల రెడ్డి గార్డెన్స్ వద్ద ముగిసింది. తర్వాత, సామ భూపాల రెడ్డి గార్డెన్స్, అత్తాపూర్ నందు శ్రీ హరినామ కీర్తనలు, శ్రావ్యమైన



భజనలు వంటి సాంస్కృతిక కార్యక్రమాలు ఉత్సాహభరితంగా నిర్వహించారు. పౌరాణిక వైదిక పాత్రల తోలుబొమ్మలతో రామాయణ ఘట్టాలను ప్రదర్శించారు. భక్తులందరికీ చప్పన్ (56) భోగ నైవేద్య దర్శనం కల్పించారు. అలాగే, ఈ రథయాత్ర సందర్భంగా వేలాది భక్తులు పాల్గొని, అందమైన పూలతో అలంకరించిన స్వామివారి రథాన్ని భక్తి శ్రద్ధలతో లాగారు. శ్రీకృష్ణుని పవిత్ర నామాలను పారవశ్యంతో పాడుతూ, నృత్యం చేస్తూ భక్తులు ఆనంద పరవశులయ్యారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న వేల కొలది భక్త జనం శ్రీ జగన్నాథుని దివ్య దర్శనం, ఆశీస్సులను పొందారు.

## రైతుల సంక్షేమమే మా ఉద్దేశ్యం.. మార్కెట్ లో దళారి వ్యవస్థ కు అవకాశం ఇవ్వం

* **రంగారెడ్డి జిల్లా జూన్ 30 (సమయం న్యూస్) : త్వరలో కోహెడ లో ఏర్పాటు చేయబోయే అంతర్జాతీయ మార్కెట్ కి ముఖ్యమంత్రి చే శంకుస్థాపన. ... ఇబ్రహీంపట్నం ఎమ్మెల్యే శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి వెల్లడి.**
* **సోమవారం రోజున బాటసింగారం పండ్ల మార్కెట్ కార్యాలయంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ చిలుక మధుసూదన్ రెడ్డి అధ్యక్షతన ఏర్పాటు చేసిన సమీక్ష సమావేశంలో పాల్గొన్న గౌరవ ఏమ్మెల్యే శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి**
* **అంతకుముందు గౌరవ ఏమ్మెల్యే శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి గారికి ఘన స్వాగతం పలికిన పాలకవర్గం...మార్కెట్ కార్యాలయం ముందు మొక్కను నాటిన ఎమ్మెల్యే రంగారెడ్డి**
* మార్కెట్ కి సంబంధించిన కార్యక్రమాలను ... త్వరలో చేపట్టబోయే కోహెడ మార్కెట్ కి సంబంధించిన ప్రాజెక్టు పనులను పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా వివరించిన అధికారులు.
* అనంతరం నిర్వహించిన పాత్రికేయ సమావేశంలో గౌరవ ఏమ్మెల్యే శ్రీ మల్ రెడ్డి రంగారెడ్డి గారు





మాట్లాడుతూ....
* రైతు సంక్షేమమే మా ఉద్దేశ్యమని... మార్కెట్ కి వచ్చే ప్రతి రైతుకు న్యాయం చేసేలా పాలకవర్గం పనిచేయాలని పిలుపునిచ్చారు.
* అధిక కమిషన్లు వసూలు చేసే మార్కెట్ వ్యాపారులను బ్లాక్ లిస్టులో పెట్టాలని..వారిపై కఠిన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.
* గత ప్రభుత్వం బాటసింగారం లాజిస్టిక్ పార్క్ లో పండ్ల మార్కెట్ ను ఏర్పాటు చేస్తే కొంతమంది భూములు మరియు షెడ్స్ అధిక రేట్లకు మార్కెట్ కి ఇచ్చారని... వాటిని తగ్గించాలని...లేని పక్షంలో మార్కెట్ పాలకవర్గం వాటి స్థానంలో కొత్త షెడ్స్ నిర్మాణం చేపట్టాలని సూచించారు..
* ఎన్టీఆర్ మార్కెట్ ముందు కొంత మంది దళారులు వ్యాపారం చేస్తూ మార్కెట్ ఆదాయంకు గండి కొడుతున్నారని..రైతులకు మార్కెట్ లో అవకాశం ఇస్తామని.. దళారులకు చోటు లేదని...పోలీస్ చెక్ పోస్ట్ పెట్టి కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.
* కోహెడ లో ఏర్పాటు చేయబోయే అధునాతన మార్కెట్ కి త్వరలో ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి చేతులమీదుగా శంకుస్థాపన చేస్తామని...దేశంలోనే మంచి సమీకృత మార్కెట్ ను ఏర్పాటు చేస్తామన్నారు..అవసరం అయితే పక్కన ఉన్న ప్రభుత్వ భూములను మార్కెట్ కి అప్పగిస్తామన్నారు.



ఈ కార్యక్రమంలో గడ్డి అన్నారం వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ శ్రీ చిలుక మధుసూదన్ రెడ్డి.... మార్కెటింగ్ అడిషనల్ డైరెక్టర్ శ్రీ లక్ష్మణుడు...రీజినల్ జాయింట్ డైరెక్టర్ శ్రీ రవికుమార్...జిల్లా మార్కెటింగ్ అధికారి...శ్రీ మహమ్మద్ రియాజ్... DE రవీందర్...మార్కెట్ ఉన్నత శ్రేణి కార్యదర్శి శ్రీ ఎల్, శ్రీనివాస్ తో పాటు వైస్ చైర్మన్ CH,భాస్కర చారి...డైరెక్టర్లు... జైపాల్ రెడ్డి....బండి మధుసూదన్ రావు...అంజయ్య...లక్ష్మి...మచ్చేందర్ రెడ్డి...రఘుపతి రెడ్డి...గణేష్‌నాయక్... గోవర్ధన్ రెడ్డి...నవరాజ్...నర్సింహా.. వెంకట్ గుప్తా...ఇబ్రహీం తో పాటు పలువురు అధికారులు పాల్గొన్నారు.

## స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 లో ప్రతి ఒక్కరు భాగస్వాములు కావాలి

* **జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ జిల్లా పిలుపు**

భూపాలపల్లి జూన్30 (సమయం న్యూస్) : సోమవారం ఐడిఓసి కార్యాలయంలో జిల్లా గగ్రామీణాభివృద్ధి శాఖ ఆధ్వర్యంలో స్వచ్ఛ సర్వేక్షణ్ గ్రామీణ్ 2025 (SSG 2025) కార్యక్రమ కర పత్రాన్ని ఆవిష్కరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ రాహుల్ శర్మ మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సంయుక్తంగా కలిసి "ఒక అడుగు స్వచ్ఛత వైపు" అనే నినాదంతో గ్రామీణ ప్రాంతాల్లో శుభ్రత, పారిశుధ్యంపై అవగాహన కల్పించడమే లక్ష్యంగా కార్యక్రమాన్ని చేపట్టినట్లు తెలిపారు. గ్రామీణ ప్రజలు యాప్ డౌన్లోడ్ చేసుకుని గ్రామాలలో పారిశుద్ధ్య కార్యక్రమాల పరిస్థితులపై అభిప్రాయాలను తెలియచేయవచ్చని పేర్కొన్నారు.

# ఇంజనీరింగ్ ఫీజులపై తెలంగాణ ప్రభుత్వం కీలక నిర్ణయం

* 2025-26 విద్యా సంవత్సరానికి ఇంజనీరింగ్ ఫీజులు యథాతథం
* పాత ఫీజులనే కొనసాగిస్తూ తెలంగాణ ప్రభుత్వం ఉత్తర్వులు
* బీటెక్, ఎంటెక్ సహా అన్ని ఇంజనీరింగ్ కోర్సులకు వర్తించేలా నిర్ణయం
* ఫీజుల సమీక్షకు సమయం పట్టనుండటంతో ఈ చర్యలు
* ఎప్‌సెట్, ఈసెట్ విద్యార్థులకు భారీ ఊరట



తెలంగాణలో ఇంజనీరింగ్ విద్యను అభ్యసించాలనుకుంటున్న విద్యార్థులకు, వారి తల్లిదండ్రులకు రాష్ట్ర ప్రభుత్వం శుభవార్తను అందించింది. 202526 విద్యా సంవత్సరానికి సంబంధించి ఇంజనీరింగ్ ఫీజులను పెంచకూడదని నిర్ణయించింది. ప్రస్తుతం అమల్లో ఉన్న పాత ఫీజులనే ఈ ఏడాది కూడా కొనసాగించాలని సోమవారం కీలక ఉత్తర్వులు జారీ చేసింది. ప్రభుత్వ తాజా నిర్ణయంతో వేలాది మంది విద్యార్థులకు భారీ ఊరట లభించినట్లయింది. ఈ ఉత్తర్వులు బీటెక్, బీఈ, ఎంటెక్, ఎంఈ, బిఒకేషనల్ వంటి అన్ని రకాల ఇంజనీరింగ్ కోర్సులకు వర్తిస్తాయని ప్రభుత్వం స్పష్టంగా పేర్కొంది. ఇటీవల ఇంజనీరింగ్ కాలేజీలలో ఫీజులు భారీగా పెరిగే అవకాశం ఉందన్న వార్తల నేపథ్యంలో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి తీవ్ర అసంతృప్తి వ్యక్తం చేశారు. ఫీజుల ఖరారుకు ముందు సమగ్రంగా అధ్యయనం చేయాలని, ఇతర రాష్ట్రాల్లోని విధానాలను కూడా పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. ఈ మేరకు నియమించిన కమిటీ నివేదిక రావడానికి మరింత సమయం పట్టే అవకాశం ఉంది.ఈ నేపథ్యంలో, ఫీజుల నిర్ణయం ఆలస్యమైతే ఎప్‌సెట్ ప్రవేశాల కౌన్సెలింగ్‌పై ప్రభావం పడుతుందని ఉన్నత విద్యామండలి అధికారులు భావించారు. కౌన్సెలింగ్ ప్రక్రియను సకాలంలో ప్రారంభించేందుకు, పాత ఫీజుల (గరిష్ఠంగా రూ.1.65 లక్షలు) ప్రకారమే అడ్మిషన్లు చేపట్టాలని యోచించారు. ఈ ప్రతిపాదనను పరిగణనలోకి తీసుకున్న ప్రభుత్వం, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని పాత ఫీజులనే కొనసాగిస్తూ తుది నిర్ణయం తీసుకుంది. అంతేకాకుండా, పాలిటెక్నిక్ డిప్లొమా పూర్తి చేసి ఈసెట్ ద్వారా నేరుగా బీటెక్, బీఫార్మసీ రెండో సంవత్సరంలో ప్రవేశాలు పొందే విద్యార్థులకు కూడా ఈ నిర్ణయం వర్తిస్తుంది. వారికి కూడా పాత ఫీజులనే వర్తింపజేయనున్నారు. ప్రభుత్వ తాజా ఉత్తర్వులతో ఫీజులపై నెలకొన్న గందరగోళానికి తెరపడటంతో పాటు, కౌన్సెలింగ్ ప్రక్రియ సజావుగా సాగేందుకు మార్గం సుగమమైంది.





## అమిత్ షా వ్యాఖ్యలకు
# సీపీఐ నారాయణ కౌంటర్

* నక్సలైట్లతో చర్చలుండవన్న అమిత్ షా వ్యాఖ్యలు
* అమిత్ షా వ్యాఖ్యలపై సీపీఐ నారాయణ తీవ్ర స్పందన
* నక్సలైట్లను చంపగలరేమో, నక్సలిజాన్ని అంతం చేయలేరన్న నారాయణ

నక్సలిజం నిర్మూలనపై కేంద్ర హోంమంత్రి అమిత్ షా చేసిన వ్యాఖ్యలు రాజకీయంగా తీవ్ర చర్చకు దారితీశాయి. నిజామాబాద్ పర్యటనలో షా చేసిన ప్రకటనపై సీపీఐ జాతీయ కార్యదర్శి నారాయణ ఘాటుగా స్పందించారు. నక్సలైట్లను చంపగలరేమో కానీ, నక్సలిజాన్ని మాత్రం అంతం చేయలేరని ఆయన అన్నారు. ఈ మేరకు ఈరోజు ఆయన ఒక వీడియో సందేశాన్ని విడుదల చేశారు. వచ్చే ఏడాది మార్చి నాటికి దేశంలో నక్సలిజాన్ని పూర్తిగా అంతం చేస్తామని అమిత్ షా చెప్పడం హాస్యాస్పదంగా ఉందని నారాయణ ఎద్దేవా చేశారు. ప్రభుత్వ విధానాలు మారనంత వరకు ఇలాంటి సమస్యలు పరిష్కారం కావని ఆయన అభిప్రాయపడ్డారు. నక్సలైట్లతో చర్చలు జరపబోమని చెప్పడం కేంద్ర ప్రభుత్వ వైఖరికి నిదర్శనమని విమర్శించారు. నిజామాబాద్ జిల్లాలో పర్యటించిన కేంద్ర హోంమంత్రి అమిత్ షా, నక్సలిజంపై కీలక వ్యాఖ్యలు చేశారు. నక్సలైట్లు తక్షణమే హింసను వీడి, ఆయుధాలు పక్కనపెట్టి జనజీవన స్రవంతిలో కలవాలని పిలుపునిచ్చారు. వారు ఆయుధాలు వీడేంత వరకు వారితో ఎలాంటి చర్చలు ఉండవని తేల్చిచెప్పారు. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు సుమారు 10 వేల మంది నక్సలైట్లు లొంగిపోయారని ఆయన గుర్తుచేశారు. "గిరిజన బిడ్డలను, పోలీసులను నక్సలైట్లు చంపినప్పుడు వారి తరఫున ఎవరూ మాట్లాడలేదు. కానీ ఇప్పుడు మాత్రం చర్చల కోసం చాలా మంది ముందుకొస్తున్నారు" అని కొందరి వైఖరిని దుయ్యబట్టారు. అమిత్ షా చేసిన ఈ వ్యాఖ్యల నేపథ్యంలోనే సీపీఐ నారాయణ పైవిధంగా స్పందించారు.



## పాశమైలారం ప్రమాదంపై గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ, బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి

* సంగారెడ్డి జిల్లా పాశమైలారం అగ్నిప్రమాదంపై గవర్నర్ విచారం
* ఈ దుర్ఘటన తనను తీవ్రంగా కలచివేసిందన్న గవర్నర్
* ప్రాణాలు కోల్పోయిన వారి కుటుంబాలకు ప్రగాఢ సానుభూతి
* గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్ష

సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామికవాడలో జరిగిన పేలుడు ఘటనపై తెలంగాణ రాష్ట్ర గవర్నర్ జిష్ణుదేవ్ వర్మ తీవ్ర విచారం వ్యక్తం చేశారు. పారిశ్రామికవాడలో రియాక్టర్ పేలడంతో పలువురు మృతి చెందడం పట్ల ఆయన దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. గవర్నర్ ప్రిన్సిపల్ సెక్రటరీ దానకిషోర్‌కు ఫోన్ చేసి ఘటనకు సంబంధించిన వివరాలను అడిగి తెలుసుకున్నారు. ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ఆయన తన సంతాపాన్ని తెలియజేశారు. క్షతగాత్రులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. బాధితులకు మెరుగైన వైద్యం అందేలా చూడాలని ప్రిన్సిపల్ సెక్రటరీని ఆదేశించారు. పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన ఘోర అగ్నిప్రమాదంపై కేంద్ర హోంశాఖ సహాయ మంత్రి బండి సంజయ్ తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర ఘటన తనను ఎంతగానో కలచివేసిందని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ప్రమాదం అత్యంత విషాదకరమని బండి సంజయ్ తన సందేశంలో పేర్కొన్నారు. ఈ ప్రమాదంలో తమ ఆప్తులను కోల్పోయిన కుటుంబాలకు ఆయన తన ప్రగాఢ సానుభూతిని తెలియజేశారు. వారి కుటుంబ సభ్యులకు మనోధైర్యాన్ని ఇవ్వాలని భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు తెలిపారు. ఈ ఘటనలో గాయపడిన వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అంది, వారు త్వరితగతిన సంపూర్ణ ఆరోగ్యంతో తిరిగి రావాలని ప్రార్థిస్తున్నట్లు బండి సంజయ్ వివరించారు.

# పాశమైలారం ప్రమాద ఘటన.. సీఎస్ నేతృత్వంలో కమిటీ

* సంగారెడ్డి ఫ్యాక్టరీ ప్రమాదంపై సీఎం రేవంత్ తీవ్ర దిగ్భ్రాంతి
* సీఎస్ నేతృత్వంలో సహాయక చర్యల పర్యవేక్షణకు కమిటీ ఏర్పాటు
* క్షేత్రస్థాయిలో పరిస్థితిపై మంత్రులతో ఎప్పటికప్పుడు సమీక్ష
* మృతుల కుటుంబాలను అన్ని విధాలా ఆదుకోవాలని అధికారులకు ఆదేశం
* రేపు ఉదయం 10 గంటలకు ఘటనా స్థలానికి వెళ్లనున్న సీఎం



సంగారెడ్డి జిల్లా పాశమైలారం పారిశ్రామిక వాడలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంపై సీఎం రేవంత్ రెడ్డి తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దురదృష్టకర ఘటనపై తక్షణమే స్పందించిన ఆయన, సహాయక చర్యలను పర్యవేక్షించేందుకు ఉన్నతస్థాయి కమిటీని ఏర్పాటు చేస్తూ కీలక నిర్ణయం తీసుకున్నారు. ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు ఈ కమిటీకి నేతృత్వం వహించనున్నారు. ఈ కమిటీలో సభ్యులుగా డీఆర్ఎఫ్ ప్రత్యేక ప్రధాన కార్యదర్శి, కార్మిక శాఖ ప్రధాన కార్యదర్శిని నియమిస్తూ ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసింది. సహాయక చర్యలను సమన్వయం చేయడంతో పాటు భవిష్యత్తులో ఇలాంటి పెను ప్రమాదాలు పునరావృతం కాకుండా తీసుకోవాల్సిన శాశ్వత చర్యలపై ప్రభుత్వానికి ఈ కమిటీ సిఫార్సులు చేయనుంది. క్షేత్రస్థాయిలో జరుగుతున్న సహాయక కార్యక్రమాల పురోగతిని సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా పర్యవేక్షిస్తున్నారు. ప్రమాద తీవ్రత, తాజా పరిస్థితులపై మంత్రులు దామోదర రాజనర్సింహ, వివేక్‌లతో ఫోన్‌లో మాట్లాడి వివరాలు తెలుసుకున్నారు. ప్రమాదంలో చిక్కుకున్న వారిని రక్షించేందుకు సహాయక చర్యలను మరింత ముమ్మరం చేయాలని, ఏమాత్రం ఆలస్యం చేయవద్దని సీఎం అధికారులను ఆదేశించారు. ఈ ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తుందని ఆయన భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలను ఆదుకునేందుకు అవసరమైన అన్ని రకాల చర్యలు వెంటనే చేపట్టాలని సంబంధిత అధికారులకు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఈ నేపథ్యంలో సీఎం రేవంత్ రెడ్డి స్వయంగా ఘటనా స్థలాన్ని సందర్శించనున్నారు. మంగళవారం ఉదయం 10 గంటలకు ఆయన పాశమైలారంలోని ప్రమాద స్థలానికి చేరుకుని, అక్కడి పరిస్థితులను పరిశీలించి, బాధితులను పరామర్శించనున్నారు.

# రాజాసింగ్ రాజీనామా.. స్పందించిన మంత్రి పొన్నం

* బీజేపీ బీసీ వ్యతిరేకి అని మరోసారి రుజువైందన్న మంత్రి పొన్నం
* అధ్యక్ష పదవికి బీసీ నేతను అడ్డుకున్నారంటూ తీవ్ర ఆరోపణ
* రాజా సింగ్ రాజీనామాతో బీజేపీపై కాంగ్రెస్ విమర్శలు
* బీజేపీ ఒక ఫ్యూడల్ పార్టీ అని పొన్నం ఘాటు వ్యాఖ్యలు
* సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యమని స్పష్టీకరణ





బీజేపీ మరోసారి తన బీసీ వ్యతిరేక వైఖరిని స్పష్టంగా బయటపెట్టుకుందని రాష్ట్ర రవాణా, బీసీ సంక్షేమ శాఖ మంత్రి పొన్నం ప్రభాకర్ తీవ్రస్థాయిలో విమర్శించారు. బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల నేపథ్యంలో గోషామహల్ ఎమ్మెల్యే రాజా సింగ్ రాజీనామా చేయడంపై ఆయన స్పందిస్తూ, ఆ పార్టీని ఒక ఫ్యూడల్ పార్టీగా అభివర్ణించారు. ఈ మేరకు సోమవారం ఆయన తన 'ఎక్స్' ఖాతా ద్వారా బీజేపీపై విమర్శలు చేశారు.

*** బీసీ నేతను అడ్డుకున్నారు: పొన్నం**

బీజేపీ రాష్ట్ర అధ్యక్ష పదవి కోసం ఒక బీసీ నాయకుడు నామినేషన్ వేయడానికి ప్రయత్నిస్తే, ఆయనను నిరంకుశంగా అడ్డుకున్నారని పొన్నం ఆరోపించారు. నామినేషన్‌కు మద్దతు తెలిపిన వారిని సైతం భయభ్రాంతులకు గురిచేయడం బీజేపీ నియంతృత్వ ధోరణికి నిదర్శనమని ఆయన అన్నారు. "ముగ్గురు బీసీ ఎంపీలు, ఎందరో సీనియర్ నాయకులు ఉన్నప్పటికీ, బీసీలకు అధ్యక్ష పదవి ఇవ్వడానికి బీజేపీకి మనసొప్పలేదు. గతంలో బీసీని ముఖ్యమంత్రిని చేస్తామని చెప్పి, కనీసం శాసనసభాపక్ష నేతగా కూడా అవకాశం ఇవ్వలేదు" అని పొన్నం విమర్శించారు. బీజేపీలో బీసీలకు ఎప్పటికీ న్యాయం జరగదని, ఆ పార్టీ నేతలే ఈ విషయంపై వాపోతున్నారని, దీనికి బీజేపీ అధిష్టానం ఏం సమాధానం చెబుతుందని ఆయన ప్రశ్నించారు.

*** రాజా సింగ్ రాజీనామాతో రాజుకున్న వివాదం**

సోమవారం జరిగిన బీజేపీ రాష్ట్ర అధ్యక్ష ఎన్నికల్లో పోటీ చేసేందుకు ఎమ్మెల్యే రాజా సింగ్ తన మద్దతుదారులతో కలిసి నాంపల్లిలోని పార్టీ కార్యాలయానికి వెళ్లారు. అయితే, తన అనుచరులను బెదిరించారని, నామినేషన్ వేయకుండా అడ్డుకున్నారని ఆరోపిస్తూ ఆయన పార్టీకి తన రాజీనామాను ప్రకటించారు. తెలంగాణలో బీజేపీ అధికారంలోకి రావడం ఆ పార్టీలోని కొందరు పెద్దలకే ఇష్టం లేదని ఆయన సంచలన వ్యాఖ్యలు చేశారు.

*** సామాజిక న్యాయం కాంగ్రెస్‌తోనే సాధ్యం**

సామాజిక న్యాయం అనేది కాంగ్రెస్ పార్టీతోనే సాధ్యమని పొన్నం ప్రభాకర్ స్పష్టం చేశారు. తమ పార్టీలో ముఖ్యమంత్రి రెడ్డి వర్గానికి చెందిన వ్యక్తి అయితే, పీసీసీ అధ్యక్షుడిగా బీసీ నేతకు అవకాశం కల్పించామని గుర్తుచేశారు. "మేము కుల గణన చేపట్టి, బీసీలకు విద్య, ఉద్యోగ, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు కల్పించేందుకు చట్టం చేశాం. కానీ బీజేపీ మాత్రం బీసీల గొంతు కోస్తోంది" అని ఆయన విమర్శించారు. గతంలో బీసీ నేత బండి సంజయ్‌ను కీలకమైన ఎన్నికల సమయంలో అధ్యక్ష పదవి నుంచి తొలగించిన విషయాన్ని కూడా మంత్రి ఈ సందర్భంగా ప్రస్తావించారు. దేశవ్యాప్తంగా రాహుల్ గాంధీ బీసీల పక్షాన నిలుస్తున్నారని, ఎస్సీ, ఎస్టీ, బీసీ, మైనారిటీలకు న్యాయం చేసేది ఒక్క కాంగ్రెస్ పార్టీయేనని పొన్నం ప్రభాకర్ పేర్కొన్నారు.

# మాదాపూర్‌లో హైడ్రా కూల్చివేతలు.. అడ్డుకున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ



హైదరాబాద్: నగర పరిధి మాదాపూర్‌లోని సున్నం చెరువులో హైడ్రా కూల్చివేతలను ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అడ్డుకున్నారు. దీనిపై ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. సున్నం చెరువులో కూల్చివేతలను ఆపేయాలని డిమాండ్ చేశారు. సున్నం చెరువులో ఆక్రమణల తొలగింపును సోమవారం హైడ్రా (Hydra) చేపట్టింది. 32 ఎకరాల విస్తీర్ణంలోని సున్నం చెరువులో భారీగా ఆక్రమణలు ఉన్నట్లు అధికారులు గుర్తించారు. ఎఫ్‌టీఎల్ పరిధిలో అక్రమంగా నిర్మించిన గుడిసెలను కూల్చేశారు. చెరువు సమీపంలో అక్రమంగా వేసిన బోరు మోటార్లను తొలగించారు. చెరువు పరిధిలోని భూగర్భ జలాలను వినియోగించొద్దని హైడ్రా సూచించింది. అక్రమంగా నీటిని తరలిస్తున్న పలు వాటర్ ట్యాంకర్లను సీజ్ చేసింది.

సమయం
మన గొంతుకే.. మన పత్రిక
తెలుగు దినపత్రిక



## ద్రవిడ్, సెహ్వాగ్ రికార్డ్‌పై యశస్వి జైస్వాల్ కన్ను



యశస్వి జైస్వాల్ టెస్ట్ క్రికెట్‌లో ఓ మైలురాయికి అడుగు దూరంలోనే ఉన్నాడు. సుదీర్ఘ ఫార్మాట్‌లో టీమ్ ఇండియా తరఫున అత్యంత వేగంగా 2000 పరుగులు సాధించిన బ్యాటర్‌గా నిలిచే అవకాశానికి చేరువగా వచ్చాడు. ప్రస్తుతం ఆ రికార్డు సంయుక్తంగా.. రాహుల్ ద్రవిడ్, వీరేంద్ర సెహ్వాగ్ పేరిట ఉంది. వీరిద్దరూ ఈ ఫీట్‌ను 40 ఇన్నింగ్స్‌ల్లో సాధించారు. మొదట ద్రవిడ్ 1999లో న్యూజిలాండ్‌పై, వీరేంద్ర సెహ్వాగ్ 2004లో ఆస్ట్రేలియాపై ఈ రికార్డును సొంతం చేసుకున్నారు. యశస్వి జైస్వాల్ 2023 జులైలో వెస్టిండీస్‌తో తన టెస్ట్ అరంగేట్రం చేశాడు. అతడు ఇప్పటి వరకు 38 ఇన్నింగ్స్‌ల్లో 52.86 యావరేజ్‌తో 1903 పరుగులు చేశాడు. జులై 2 నుంచి బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ వేదికగా ఇంగ్లాండ్‌తో టీమ్‌ఇండియాకు జరగనున్న రెండో టెస్ట్ మ్యాచ్‌లో జైస్వాల్ మరో 97 పరుగులు సాధిస్తే.. ద్రవిడ్, సెహ్వాగ్ రికార్డ్‌ను అధిగమించే అవకాశం ఉంది. లీడ్స్‌లో హెడింగ్లీ వేదికగా ఇంగ్లాండ్‌తో జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్‌లో 159 బంతుల్లో 101 పరుగులు చేశాడు. ఇందులో 16 ఫోర్లు, 6 సిక్స్‌లు ఉన్నాయి. అయితే రెండో ఇన్నింగ్స్‌లో మాత్రం విఫలమయ్యాడు. 11 బంతుల్లో కేవలం 4 పరుగులు మాత్రమే చేసి పెవిలియన్ బాట పట్టాడు.

## అతడు ఒక్క సెంచరీతోనే ఆగిపోడు: సంజయ్ మంజ్రేకర్

ప్రస్తుతం భారత జట్టు ఇంగ్లాండ్‌లో పర్యటిస్తోంది. ఇందులోభాగంగా టీమ్ఇండియా ఇంగ్లండ్ జట్టుతో అయిదు టెస్ట్ మ్యాచ్‌ల సిరీస్ ఆడనుంది. అయితే లీడ్స్‌లోని హెడింగ్లీ వేదికగా జరిగిన మొదటి టెస్ట్ మ్యాచ్‌లో గిల్ సేన ఓటమి చవిచూసింది. అయినప్పటికీ ఆ మ్యాచ్‌లో టాప్ ఆర్డర్ మంచి ప్రదర్శన కనబర్చింది. ఇది టీమ్‌ఇండియాకు సానుకూలాంశం. శుభ్‌మన్‌గిల్, కేఎల్ రాహుల్, యశస్వి జైస్వాల్ శతకాలు బాదారు. ఇక రిషభ్ పంత్ రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు సాధించాడు.



పంత్ తన సూపర్ ఫామ్‌ను రెండో టెస్ట్ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తాడని టీమ్‌ఇండియా మాజీ క్రికెటర్ సంజయ్ మంజ్రేకర్ ఆశాభావం వ్యక్తంచేశాడు. అలాగే కేఎల్ రాహుల్ కూడా రాణిస్తాడని వివరించాడు. 'రిషభ్ పంత్ ప్రస్తుతం అద్భుతమైన ఫామ్‌లో ఉన్నాడు. అతడు దాన్ని రెండో టెస్ట్ మ్యాచ్‌లోనూ కొనసాగిస్తాడు. ఒక టెస్ట్ మ్యాచ్‌లో రెండు ఇన్నింగ్స్‌ల్లోనూ సెంచరీలు సాధించడం అంటే మామూలు విషయం కాదు. రిషబ్ పంత్ పరుగుల దాహంతో ఉన్నాడు. అతడు కచ్చితంగా మరిన్ని రన్స్ సాధిస్తాడు. అలాగే కేఎల్ రాహుల్ మొదటి టెస్ట్‌లో సెంచరీ చేశాడు. అతడు ఈ ఒక్క శతకంతోనే ఆగిపోడు. మరిన్ని అద్భుతమైన ఇన్నింగ్స్‌లు ఆడతాడు' అని సంజయ్ మంజ్రేకర్ విశ్లేషించాడు. ఇంగ్లాండ్, టీమ్ఇండియా మధ్య రెండో టెస్ట్ మ్యాచ్ బర్మింగ్‌హామ్‌లోని ఎడ్జ్‌బాస్టన్ మైదానంలో జులై 2 నుంచి జరగనుంది. వర్క్‌లోడ్ నేపథ్యంలో జస్ప్రీత్ బుమ్రా రెండో మ్యాచ్‌కు అందుబాటులో ఉండకపోవచ్చని తెలుస్తోంది. ఇంగ్లాండ్ స్క్వాడ్‌లో స్థానం సంపాదించుకున్న జోఫ్రా ఆర్చర్ రెండో టెస్ట్ మ్యాచ్ ద్వారా టెస్ట్ క్రికెట్‌లోకి పునరాగమనం చేసే అవకాశం ఉంది.

## భారత స్పిన్నర్ డ్రీమ్ టీమ్.. కోహ్లీ, రోహిత్‌కు దక్కని చోటు

ఈ ఏడాది జరిగిన ఛాంపియన్స్ ట్రోఫీని టీమ్‌ఇండియా కైవసం చేసుకున్న సంగతి తెలిసిందే. భారత్ ఈ ట్రోఫీ నెగ్గడంలో మిస్టరీ స్పిన్నర్ వరుణ్ చక్రవర్తి కీలకపాత్ర పోషించాడు. మూడు మ్యాచ్‌లు ఆడి 9 వికెట్లు పడగొట్టాడు. ఆగస్టులో బంగ్లాదేశ్‌తో జరగనున్న వన్డే, టీ20 సిరీస్‌లపై దృష్టిసారించిన వరుణ్.. తాజాగా మాజీ స్పిన్నర్ రవిచంద్రన్ అశ్విన్‌తో యూట్యూబ్ ఇంటర్వ్యూలో పాల్గొన్నాడు. ఇందులో పలు ఆసక్తికర విషయాలు పంచుకున్నాడు. టీ20 ఫార్మాట్‌లో ఆల్‌టైమ్ ప్లేయింగ్ ఎలెవన్‌ను ఎంచుకోమని చక్రవర్తిని అశ్విన్ కోరాడు. కానీ, ఇప్పటివరకు ఎవరితోనైతే కలిసి ఆడావో వారిలో నుంచే టీమ్ ఎంపిక ఉండాలని చక్రవర్తికి అశ్విన్ షరతు పెట్టాడు. భారత్ నుంచి వరుణ్ ముగ్గురు ఆటగాళ్లను ఎంచుకోగా అందులో విరాట్ కోహ్లీ, రోహిత్ శర్మ లేరు. ఆసక్తికర విషయం ఏంటంటే వరుణ్ చక్రవర్తి 2021 టీ20 ప్రపంచకప్ సమయంలో కోహ్లీ సారథ్యంలోనే పొట్టి ఫార్మాట్‌లోకి అరంగేట్రం చేశాడు. ఈ ఏడాది ఆరంభంలో రోహిత్ శర్మ కెప్టెన్సీలో వన్డేల్లోకి ఎంట్రీ ఇచ్చి ఛాంపియన్స్ ట్రోఫీలోనూ ఆడాడు. గ్రూప్ దశలో కివీస్‌తో జరిగిన మ్యాచ్‌లో (5/42) అదరగొట్టాడు.



## కుండ బద్దలు కొట్టిన దిల్‌రాజు..
## నితిన్ నువ్వు ఆ స్థాయికి రాలేకపోయావు!



హైదరాబాద్: సినిమాలు, ఇతర అంశాలపై తన అభిప్రాయాన్ని స్పష్టంగా చెప్పే వ్యక్తుల్లో నిర్మాత దిల్‌రాజు ఒకరు. అందుకే ఆయనకు సక్సెస్ రేటు ఎక్కువ. తాజాగా హీరో నితిన్ విషయంలోనూ తన అభిప్రాయాన్ని ముక్కుసూటిగా చెప్పారు. ఇండస్ట్రీలో హీరో నితిన్ కన్నా తాను ఏడాది జూనియర్‌నని అంటూనే, తాను అనుకున్న స్థాయికి నితిన్ రాలేకపోయాడని అభిప్రాయపడ్డారు. శ్రీ వెంకటేశ్వర క్రియేషన్స్‌పై దిల్‌రాజు నిర్మించిన తాజా చిత్రం 'తమ్ముడు'. నితిన్ కథానాయకుడు. వేణు శ్రీరామ్ దర్శకత్వం వహించారు. లయ, వర్ష బొల్లమ్మ, సప్తమీ గౌడ తదితరులు కీలక పాత్రలు పోషించారు. అన్ని కార్యక్రమాలు పూర్తి చేసుకున్న ఈ మూవీ జులై 4న ప్రేక్షకుల ముందుకు రానుంది. ఈ సందర్భంగా నితిన్, దిల్‌రాజుల మధ్య ఆసక్తికర ఇంటర్వ్యూ జరిగింది. 'దిల్'తో నిర్మాత అయిన రాజు ఆ తర్వాత ఆ సినిమా పేరునే ఇంటి పేరుగా మార్చుకున్నారు. ఈ సందర్భంగా నితిన్ అడిగిన ప్రశ్నకు ఎలాంటి మొహమాటం లేకుండా సమాధానం ఇచ్చారు. ''దిల్'కీ 'తమ్ముడి'కీ మధ్యలో నితిన్‌లో చూసిన మార్పులేంటి? ప్లస్, మైనస్‌లు రెండూ చెప్పండి'' అని నితిన్ అడగ్గా, ''ఒక నటుడిగా 22 ఏళ్లు సుదీర్ఘ జర్నీ చేశావ్. నిజం చెప్పాలంటే నాకంటే ఇండస్ట్రీలో ఒక సంవత్సరం సీనియర్‌వి. నువ్వు 2002లో హీరో అయితే, నేను 2003లో నిర్మాతగా మారా. నీకు నాకూ అనుభవం వచ్చింది. నాకు ఎలాగైతే పరిస్థితులకు అనుగుణంగా నిర్ణయాలు తీసుకునే సామర్థ్యం వచ్చిందో నీకూ అలాగే వచ్చింది. నీకంటే జూనియర్‌ని అయినా, కెరీర్‌లో ఒక్కోటి సాధించుకుంటూ ఒక టాప్‌లోకి వచ్చా. నితిన్‌ను కూడా అలాగే ఊహించుకున్నా. ఎందుకంటే 'దిల్' తీసేటప్పుడు నువ్వు.. 'ఆర్య' చేసేటప్పుడు అల్లు అర్జున్‌లు ఫ్యూచర్‌స్టార్స్‌గా కనిపించారు. కానీ, నువ్వు మాత్రం ఆ మార్కును సాధించలేకపోయావు'' అని నిర్మొహమాటంగా చెప్పేశారు.

## సినిమా

## డబుల్ ప్యాకేజీ?

టాలీవుడ్‌కు కాస్త గ్యాప్ ఇచ్చి మళ్లీ వరుస ప్రాజెక్ట్‌లతో అలరించేందుకు రెడీ అయ్యింది మహానటి కీర్తి సురేశ్. తాజాగా ఈ భామ నటించిన 'ఉప్పు కప్పురంబు' చిత్రం జులై 4న ప్రేక్షకుల ముందుకు రాబోతోంది. ఈ సినిమా స్ట్రీమింగ్ కు డేట్ దగ్గర పడటంతో ప్రచార కార్యక్రమాలను జోరుగా నిర్వహిస్తున్నారు. మరోవైపు ప్రస్తుతం కీర్తి చేతిలో రెండు క్రేజీ ప్రాజెక్ట్ లు ఉన్నాయి. అందులో ఒకటి విజయ్ దేవరకొండ రౌడీ జనార్దన్ కాగా.. మరోటి వేణు డైరెక్ట్ చేస్తున్న ఎల్లమ్మ. వీటిల్లో ఈ అమ్మడికి మంచి రోల్ దక్కినట్టు తెలుస్తోంది. అంతేకాదు ఈ రెండు సినిమాలకు కలిపి ఈ బ్యూటీ భారీ రెమ్యునరేషన్ అందుకుంటుందని సమాచారం. ఒకే బ్యానర్ లో వస్తున్న ఈమూవీలకు సంబంధించి కీర్తి సురేశ్ కోసం స్టార్ ప్రొడ్యూసర్ దిల్ రాజు డబుల్ ప్యాకేజ్ ఇస్తున్నట్టు టాక్. సో అటు సినిమాల పరంగా సంతృప్తితో పాటుగా ఇటు రెమ్యునరేషన్ పరంగా కూడా చాలా హ్యాపీగా ఉందంట మహానటి . ఇక ఈ రెండు చిత్రాలు కీర్తికి సూపర్ ట్రీట్ అందిస్తాయని ఫ్యాన్స్ అంచనా వేస్తున్నారు.



## కార్మికుల కోసం

ప్రభాస్ స్పిరిట్ నుంచి దీపిక పదుకొణెను దర్శకుడు సందీప్‌రెడ్డి వంగా తొలగించిన సంగతి తెలిసిందే. ఎనిమిది గంటల పని దినాన్ని వ్యతిరేకించిన దీపిక దీంతో పాటు, అదనంగా ఇంకా చాలా కండిషన్లు పెట్టడంతో ఈ సినిమా నుంచి తొలగించారని కథనాలొచ్చాయి. బాలింత తల్లులకు పని చేసే సమయాన్ని ఆరు గంటలకే పరిమితం చేయాలని దీపిక కోరినట్టు కూడా వార్తలొచ్చాయి. అదంతా కాసేపు పక్కనబెడితే ఇప్పుడామె సెట్లో ఆర్టిస్టులు, సిబ్బందికి పని గంటలు, సౌకర్యాల హక్కుల విషయంలో తాను చాలా కాలంగా పోరాడుతున్నట్టు వెల్లడించింది. 'సెట్లలో 8 గంటలకు మించి పని చేసే సిబ్బందిని చూస్తున్నాను. ఉదయం తొందరగా వస్తారు. డ్యూటీ ముగిసాక కూడా చాలా ఆలస్యంగా ఇంటికి వెళతారు. ఇది సరికాదు. ఎక్కువ సమయం పని చేస్తే, చేసిన పనికి గంటల లెక్కన వారికి అదనపు భత్యం చెల్లించాలి' అని డిమాండ్ చేసింది. హీరోలు, దర్శకుల వంటి వారు అదనపు పని గంటలు పని చేస్తే రివార్డులు దక్కుతాయని, సిబ్బందికి అలాంటి పరిస్థితులు ఉండవని పేర్కొంది. అధిక పని ఒత్తిడి ప్రొడక్ట్ నాణ్యతపై ప్రభావం చూపుతుందనేది ఆమె వాదన. డిప్రెషన్ కారణంగానే తాను చాలా విషయాలు తెలుసుకున్నట్లు చెప్పింది.





అనన్య నాగళ్ల అందచందాలు, ఆమె సహజమైన మెరుపును మరింతగా పెంచేలా రూపొందించబడ్డాయి, ఇప్పటికే ఆకర్షణీయమైన ఆమె సౌరభానికి రాజ సౌందర్యాన్ని జోడిస్తాయి.

## దీపావళికి కే ర్యాంప్

టాకీస్: జైన్స్ దర్శకత్వంలో కిరణ్ అబ్బవరం హీరోగా వస్తున్న సినిమా కే ర్యాంప్. నాగ శౌర్య యొక్క రంగబలి , ఉన్ని ముకుందన్ యొక్క మార్కోలో ప్రధాన పాత్రలు పోషించిన యుక్తి థరేజ ఈ సినమాలో ప్రధాన పాత్రల్లో నటిస్తున్నారు. రాజేష్ దండా ఈ సినిమాను నిర్మిస్తున్నాడు. క సినిమాతో సత్తా చాటిన కిరణ్ అబ్బవరం నటిస్తున్న ఈ సినిమాపై ఇప్పటికే హైప్ క్రియేట్ అయ్యింది. ఈ సినిమా షూటింగ్ ఫిబ్రవరిలో రామానాయుడు స్టూడియోలో ప్రారంభమైంది. తాజాగా ఈ సినిమా రిలీజ్ డేట్ పై క్లారిటీ వచ్చింది. ఇందుకు సంబందించిన ఫస్ట్ లుక్ ను రిలీజ్ చేశారు మేకర్స్. దీపావళికి సినిమా రిలీజ్ చేయబోతున్నట్టు ప్రకటించారు. దీనికి సంబంధించిన పోస్టర్ ను ఇన్ స్టాలో పోస్ట్ చేశాడు కిరణ్. దీనికి 'ఎంటర్ టైన్ మెంట్, ఎంటర్ టైన్ మెంట్, ఎంటర్ టైన్ మెంట్' అనే ట్యాగ్ ఇచ్చాడు. అభిమానులు ఈ పోస్టర్ చూసి సంతోషం వ్యక్తం చేస్తున్నారు.




Printed, Published by Mohammed Murthuza. Printed at Vivek Art Printers APHP SHOP NO.12, OSMANIA UNVERSITY ROAD,HYDERABAD. PUBLISHED ROOM NO.10, Ground Flour, Budha Bhavan, M.G.Road, Secunderabad -03. Ali Publication, Hyderabad. www.samayam.net Mobile No. 98660 19778, 89789 60131.